ప్రజాశక్తి ఆదివారం అనుబంధం
జూన్ 21, 2009
ఊయల ఊగినదోయి మనసు...

హ్యాపీ బర్త్‌డే

(2009 జూన్ 21 నుంచి 2009 జూన్ 27 వరకు)

ఎస్. రాజు
జూన్-22
జంగమ్మ-పాండు
ఇబ్రహీంపట్నం-రంగారెడ్డి

ఎస్. గురుప్రసన్న
2సం॥, జూన్-2007
చంద్రకళ-రామయ్య
సిద్దారెడ్డిపల్లె-కడప

షేక్ షఫ్రీన్ షరీఫ్
5సం॥,జూన్-25
రహంతున్నిసా-మస్తాన్ షరీఫ్
కనిగిరి-ప్రకాశం

కె. మనస్విని
1సం॥, జూన్-23
పల్లవి- మోహన్
పెద్దతుంబళం-కర్నూలు

అనిరుధ్ రాహుల్
3సం॥, జూన్-23
శ్రీదేవి-గిప్సన్
గోనెగండ్ల-కర్నూలు

ఎ. చిన్ను
3సం॥,జూన్-27
లక్ష్మి-వెంకట్
రాజమండ్రి-తూ॥గో

దినేష్ చౌదరి
5సం॥,జూన్-2004
సత్యవతి-వెంకట్రావు
గోవిందాపురం-ఖమ్మం

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పోస్ట్ కార్డు తీసుకోండి. దాని మీద మీ బాబు- పాప పేరు , పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు , తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కార్డు పై కలర్ ఫొటో అతికించడం మరువకండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి
ప్లాట్ నెం. 21/1, ఎం.హెచ్ భవన్
ఆజమాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగం పల్లి,
హైదరాబాద్-500 020

మనలో మాట

మృగాళ్లు!



⊃ అనిత (తాండూరు) శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయటికెళ్లింది. రాత్రయినా తిరిగి రాలేదు. చివరికి పొలాల్లో కనిపించింది. మానం, ప్రాణం రెండూ కోల్పోయి దిక్కు లేకుండా!

⊃ కుసుమకుమారి (చార్మినార్) కానిస్టేబుల్. శనివారం డ్యూటీ ముగించుకొని ఇల్లు చేరింది. అదే ఆమె జీవితంలో చివరి రోజని ఎవరూ ఊహించలా! ఉదయం చూస్తే సొంత ఇంట్లో మంచంమీద రక్తపుమడుగులో విగతజీవిగా కనిపించింది.

⊃ సమీరా (పాతబస్తీ) గురువారం సాయంత్రం చార్మినార్ వెళ్లింది. అమాయకంగా ప్రేమికుడి ముసుగులో వున్న వ్యక్తి పక్కనే నిలబడి చార్మినార్ అందాలను ఆస్వాదిస్తోంది. ఉన్నట్టుంది ఆ నయవంచకుడామెను కిందకి తోసేశాడు. 70 అడుగుల ఎత్తునుంచి కిందపడడంతో కాళ్లు, చేతులు విరిగి, విపరీతంగా గాయాలై మృత్యువుతో పోరాడి ఓడిపోయింది.

⊃ మానస (అనంతపురం) ఆదివారం రాత్రి అమ్మమ్మ పక్కనే పండుకుని నిద్రపోతోంది. రెండు గంటల సమయంలో కామంతో కళ్లు మూసుకుపోయిన ఒకడు మానస దగ్గరకొచ్చి కోరికతీర్చమని బలవంత పెట్టాడు. ఒప్పుకోకున్నా ఆమెపై అత్యాచారం చేశాడు. విషయం బయటకు పొక్కకుండా ఆమెపై కిరోసిన్ పోసి నిప్పంటించేశాడు.

⊃ భర్త టిఫెన్ తీసుకుంటుండగా ఓ గృహిణి (నెల్లూరు) శనివారం రాత్రి రోడ్డుమీద నిలబడి వుంది. అతను టిఫెన్ తీసుకొస్తాడు. కలిసి వెళదామన్నది ఆమె ఉద్దేశ్యం. ఈలోగా ఆటో రావడం కేకలు పెడుతున్నా.. బలవంతంగా... ఆమెను ఎక్కించుకెళ్లడం... పదిమంది కలిసి ఆమెపై అత్యాచారం చేయడం అంతా అయిపోయింది.

మనసు ముక్కలు చేసే పైసంఘటనలన్నీ కేవలం వారం రోజుల వ్యవధిలో జరిగినవే. బయటికి రానివి ఎన్నో... నట్టింట్లోను... నడివీధిలోను మహిళకు రక్షణ లేకుండా పోయిందనడానికి సజీవ సాక్ష్యాలివి. 'మృగాళ్ల' ఆటవిక చర్యలకు అమాయకులైన మహిళలు, బాలికలు బలౌతున్నారనడానికి నిలువెత్తు నిదర్శనాలు.

'మృగాలు'లో సగం, 'మగాళ్లు'లో సగం కలిసి 'మృగాళ్లు'గా తయారై ప్రాణాలు, మానాలు దోచుకుంటున్నారు. కాకపోతే వీరు మృగాళ్లన్న విషయం మామూలు కంటికి తెలీడంలా! ఓ తండ్రి, భర్త, అన్న, తమ్ముడు రూపాల్లో చాలా మామూలుగా మన మధ్యే తిరుగుతున్నారు. గుర్తించడం మహా కష్టం. అదే అడవిలో పులో, సింహమో అనుకోండి. అవి క్రూరమృగాలని తెల్సు కాబట్టి... వాటిని చూడగానే... సురక్షిత ప్రాంతాలకు పరుగెడతాం. కానీ మానవ నసమాజంలో దర్జాగా సంచరిస్తున్న మృగాళ్లు అలా కాదే! అందరిలానే బట్టలు వేసుకుంటారు. అందరిలానే పనిపాటలు చేస్తుంటారు. అయితే మాటు వేసి ... అదను చూసుకొని దాడి చేసి... అత్యాచారం జరపడం... ఆపై మట్టు పెట్టడం... వారి నైజం.

అమాయకుల మానప్రాణాలను హరించివేసే మృగాళ్లను కట్టడి చేయాలంటే సామాజిక స్పందన వుండాలి. సామూహికంగా ప్రతిఘటించగలగాలి. 'ఖాకీ'లు మా పరిధిలోకి రాదంటూ గిరిగీసుకొని చేతులు దులుపుకోవడం మానాలి. సర్కారు కదిలి తక్షణ చర్యలు తీసుకోవాలి. శిక్షలు అమలు జరపాలి. అప్పడే కొద్ది మంది ప్రాణాలనైనా కాపాడుకోగలుగుతాం. వారి అమాయకపు మోముల్లో చిరునగవు చెరగిపోకుండా రక్షించుకోగలుగుతాం.

★

ఈ సంచికలో....

టపా	...	2
తమాషాగా	...	3
విజ్ఞాన వీచిక	...	6
సీరియల్	...	8
కవిత్వమ్	...	10
తెల్సా	...	11
బాల నేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
రుచి	...	19
క్రైమ్‌కథ	...	20
కథ	...	22
కొత్త పుస్తకాలు	...	24

ఇంకా...



స్ఫూర్తి ... 4
"స్వేచ్ఛాపథం"



తెలుసుకుందామా... 7
తిరువనంతపురం తీరేవేరు

ఆరోగ్యం... 18
వర్షాకాలంలో
చెవి ఇన్‌ఫెక్షన్



సమ్‌థింగ్ స్పెషల్... 21
ఆరోగ్య ప్రదాయని దానిమ్మ



ఆకట్టుకున్న 'రుతుపవనాలు'

'రుతుపవనాలు జీవనతరంగాలు' అట్టమీది కథ ఆద్యంతం ఆకట్టుకుంది. తెల్సా?, విజ్ఞాన వీచిక వినోదాత్మకంగా కొత్త విషయాల్ని తెలియజేస్తున్నాయి. 'కుందేలు తెలివి' కథ బాగుంది. 'బాల నేస్తాలు'లో చిత్ర విచిత్రమైన బొమ్మలు ఇవ్వండి. మనలో మాట మరపురానిది. చేపమందు గురించి ఇచ్చిన 'చాదస్తం' గుడ్ ఎడిటో'రియల్'.

బిక్కునూరు రాజేశ్వర్, పొన్కల్.

కమ్మని పాలవుండలు

పాల వుండలు కమ్మగా కరకరలాడుతున్నాయి. రుతు పవనాల తీరుతెన్నులు, టోర్నడో, ఈశాన్య, నైరుతి రుతుపవనాల గురించి బాగా వివరించారు. అలాగే విజ్ఞాన వీచికలో వివిధ రకాల కాలుష్యాల వల్ల మానవాళికి కలిగే విపత్తు, పర్యావరణం కాపాడుకొనే తీరు బాగా రాశారు. సొరకాయ బొమ్మలు బాగున్నాయి. రాబోయే రుతుపవనాలకు మనసు పులకరింపచేసేలా వుంది ముఖచిత్రం.

వాస్తు రామచంద్ర,
రాంజీ నగర్, నెల్లూరు.

కంప్యూటర్ జాగ్రత్తలు

ఈవారం కంప్యూటర్లమీద పనిచేసేవారు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చక్కగా చెప్పారు. చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకుంటే పెద్ద సమస్యలనే అధిగమించవచ్చని తెల్సుకున్నాం. ఇలాంటి టిప్స్ కూడా అప్పుడప్పుడూ ఇస్తుంటే మాలాంటి పాఠకులు తెల్సుకుని జాగ్రత్తపడతారుకదా.

రాంబాబు, హయత్‌నగర్.

బెతూన్ జీవితం నిజంగా స్ఫూర్తిదాయకం

మిత్రులు తెలకపల్లి రవిగారి వ్యాసం 'స్ఫూర్తి' విజ్ఞానదాయకమైనది. చాలా సంవత్సరాల కిందట చదివిన డా॥కోట్నిస్, నార్మన్ బెతూన్ గురించిన అంశాలు జ్ఞాపకం చేసుకున్నాను. ఈ వ్యాసం పాఠకులకు స్ఫూర్తిదాయకంగా వుంది. డాక్టర్లకు కోట్నిస్, బెతూన్ ఆదర్శం. కానీ ఎంతమంది డాక్టర్లు వారిని అనుసరిస్తున్నారు? కమ్యూనిస్టు భావజాలంగల కొంతమంది డాక్టర్లు నేటికీ ప్రజావైద్యులుగా వున్నారు. ప్రజావైద్యశాలలు ఉన్నాయి. విజ్ఞాన వీచిక ద్వారా 'కాలుష్యం ఎంత కఠినం?' వ్యాసం అందించినందుకు ధన్యవాదాలు. నేడు పర్యావరణానికి ముప్పు ఏర్పడింది. నివారణకు ఉద్యమించాలి.

టి. శ్రీరామమూర్తి,
గాజువాక, విశాఖ.

కాలుష్యం నిజంగానే కఠినమైనది

కాలుష్యం గురించి విజ్ఞాన వీచికలో ఇచ్చిన వ్యాసం చదివాం. చాలా మంచి అంశాలను ప్రస్తావించారు. మన చుట్టూ ఎన్నో కాలుష్య కారకాలు పేరుకుపోతున్నాయి. దానికి కారణం మనమే. ఆ విషయం తెల్సినా దాని నివారణకు ఏమాత్రం ప్రయత్నించం. అదే మనకు ప్రాణాలమీదకు తెస్తోందని వ్యాసం చక్కగా వివరించింది. ఇన్ని మంచి విషయాలను తెలియచేసినందుకు కాకర్లమూడి విజయ్‌గారికి ధన్యవాదాలు.

జె. పాండురంగారావు,
నారాకోడూరు.



సొరకాయ బొమ్మలు సూపర్

రంగుల పేజీలో ఇచ్చిన రకరకాల సొరకాయ బొమ్మలు మమ్మల్ని ఎంతగానో ఆకట్టుకున్నాయి. మా పిల్లలు కూడా చూచి చాలా సంతోషించారు. మొత్తంమీద మా కుటుంబీకులందర్నీ కట్టిపడేసిన సొరబొమ్మలు సూపర్‌గున్నాయి. ఇలాంటి విషయాలు రంగుల్లో మరిన్ని ప్రచురించండి. సంతోషిస్తాం. మా పిల్లలైతే ఆ బొమ్మలను పక్కవారికి కూడా చూపించారు. ఇంతకంటే ఏం కావాలండీ...

అనిత, సుబ్బారావు,
రంగారెడ్డి.

★





తమాషాగా

- గీతాసుబ్బారావ్

క్రికెట్ మేనియా

'ఛీఛీ! నువ్వు దేశద్రోహివి! శాడిస్టువి!'

'అంటే.. పొద్దస్తమానం క్రికెట్ చూడటం.. దేశభక్తి అవుతుందా? క్రికెట్ వుందని ఆఫీసుకు సిక్ లీవ్ పెట్టి... ఆ టీవీ ముందు కూర్చొని టీవీ చూస్తూ... కాఫీ, టిఫిను.. భోజనం అన్నీ అక్కడికే ఇవ్వమని ... ఏం తింటున్నామో... ఏం తాగుతున్నామో తెలియకుండా.. క్రికెట్ ఆటలో లీనమయి పోవడం... మీ దృష్టిలో దేశభక్తి! అవునా?'

'నేను అలా అనలేదే!..'

'అనాలా? ... పొద్దస్తమానం క్రికెట్ ఆట చూడవద్దన్నానని.. నన్ను దేశద్రోహి అన్నారుగా!...'

'అందుకనలేదు!... మనవాళ్లు ఓడిపోతే.. పీడ వదలింది... అని చప్పట్లు కొట్టావు చూడూ! అందుకన్నాను...'

'అనరా మరి?.. ఈ మధ్య.. ఎక్కడో అక్కడ క్రికెట్ ఆట జరగుతూనే వుంది!... అందుకని... ఆఫీసుకు సెలవు పెట్టి టీవీ ముందు కూర్చుంటారా? పైగా... నన్ను కూడా... సెలవు పెట్టమని గోల చేస్తున్నారు! మీరు మీ అబ్బాయిని కూడా చెడగొట్టారు! మీతో పాటు వాడు కూడా స్కూలుకి డుమ్మా కొట్టి టీవీ చూస్తూ... పాఠాలన్నీ మర్చిపోతున్నాడు!'

'అందుకుని.. క్రికెట్‌లో మనవాళ్లు ఓడిపోవాలని కోరుకుంటావా?...'

'మరి.. మన టీమ్ ఓడిపోగానే చప్పట్లు కొట్టావెందుకూ?.. మీ ఆఫీసులో ఎవరూ క్రికెట్ చూడారా?'

'ఎందుకు చూడరూ?... ఆఫీసులోనే కాదు... బయట రోడ్డు మీద కూడా ఇదే వేలం వెర్రి!.. మొన్న... ఆటోవాడు హఠాత్తుగా దారిలో ఆటో ఆపేసి.. 'టీవీలో క్రికెట్ చూడాలి... మీరు మరో ఆటో చూసుకోండి' అన్నాడు!..ఇక పని మనిషి.. మొన్న డుమ్మా కొట్టింది!.. జ్వరం వచ్చిందా అంటే.. జ్వరం రాలేదు! టీవీలో క్రికెట్ చూస్తున్నా!.. నాకు క్రికెట్ అంటే చాలా ఇష్టం.. అంటూ తిప్పుకుంటూ చెప్పింది!'

అంటే ఏంటి?... క్రికెట్ చూస్తున్నా అని చెప్పడం ఫ్యాషన్! అదో...గొప్ప! మొన్నటికి మొన్న.. బస్‌స్టాప్‌లో ఓ పెద్దాయన గబగబా నా దగ్గరకు వచ్చి.. 'ఆంటీ.. స్కోర్ ఎంత?' అని అడిగాడు!.. నాకు పిచ్చి కోపం వచ్చింది!.. ఇది రేడియో కాదు.. మొబైల్ ఫోన్.. అని చెప్పా!.. 'తెలుసులేవమ్మా... మొబైల్ ఫోన్‌లోనే క్రికెట్ స్కోర్ చెప్తారు.. సర్లే.. నీకు తెలవదనుకుంటా.. ఓ రెండు రూపాయలు ధర్మం చెయ్యి! టీ తాగుతా..' అంటూ వెంట పడ్డాడు! ఇక మా ఆఫీసులో పోయనవారం ఒకరిద్దరు తప్ప.. మిగతా వళ్లెవరూ పని చెయ్యలేదు!.. నిన్న.. ఫైళ్లన్నీ.. ఒక్కసారి నా నెత్తిమీద పడేశారు!'

'అందుకని.. క్రికెట్‌లో మనోళ్లు ఓడిపోతే.. చప్పట్లు కొడతావా?...

'కొట్టనా మరి?.. ఈల వెయ్యడం రాదు! వస్తే.. ఈల కూడా వేసేదాన్ని!.. ఎంత క్రికెట్ అయితే మాత్రం.. ఇంత వేలం వెర్రి ఏమిటండీ? క్రికెట్ ఆట ప్రతిరోజూ.. ఏదో విధంగా .. మనవాళ్లు ఎవరి మీదనో ఆడుతూనే వుంటారు! అందుకని.. పనులు మానుకొని.. చదువులు మానుకొని.. టీవీల ముందు కూర్చుంటారా?... మనవాళ్లు గెలిస్తే... గెలిచారని..ఆనందంతో తాగుతారు!.. ఓడిపోతే... బాధతో తాగుతారు! దీన్ని వేలం వెర్రి అనక ఏమంటారు?...'

'అందుకని.. క్రికెట్‌లో మనవాళ్లు ఓడిపోవాలని కోరుకుంటావా?.. అందుకే నిన్ను దేశద్రోహి అన్నాను!.. క్రికెట్ మన దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకు వస్తుంది తెలుసా?..'

'అందుకని.. ఆ క్రికెట్ వాళ్లు ఆడుతూ వుంటే మీరు.. టీవీల ముందు కూర్చొని.. చూస్తూ.. వుంటారా?... ఈ కూర్చుని.. ఆట చూస్తే.. కళ్లు దెబ్బతింటాయి!.. పొట్ట పెరుగుతుంది! నిజంగా మీకు క్రికెట్ ఆట అంటే ఇష్టం అయితే వారానికో రోజు.. లేదా.. రోజుకో గంట.. క్రికెట్ ఆడండి! ఆరోగ్యం బాగుంటుంది! అంతేకానీ.. ఇలా కూర్చుంటే ఏం లాభం? అయినా బహిరంగ స్థలాల్లో.. ఆఫీసుల్లో.. సిగరెట్ కాల్చడం బ్యాన్ చేసినట్టు.. క్రికెట్ చూడటం బ్యాన్ చెయిస్తే కానీ.. మీ లాంటి వారు బాగుపడరు!.. మీరు ఎలా ఉన్నా.. చదువుకునే పిల్లలైనా బాగుపడతారు!..'

'సరే!... మీనాన్న లాయర్ కదా! .. ఆయనకు చెప్పి.. కేసు పెట్టించి.. బ్యాన్ చేయించు!.. ఇప్పుడు సిగరెట్లు తాగడం.. డ్రయివింగ్ చేస్తూ సెల్‌ఫోన్లు వాడడం.. ఎంత మంది మానేశారో.. అంతమంది.. క్రికెట్ చూడటం ఆఫీసుకు డుమ్మా కొట్టడం మానేస్తారు!..

'ఎగతాళి చెయ్యకండి!..ఏదో ఒక రోజు అధికారం ఆడవాళ్లకు వస్తుంది! మీలాంటి వాళ్లని ఓ ఆట ఆడిస్తాం!...

★



- ఎస్. వెంకట్రావు
సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు

నవల చదువుతున్నప్పుడు నేను విపరీతమైన భావోద్వేగానికి లోనైనాను. పిల్లలకు గాని, పెద్దలకు గాని చదువు యొక్క ప్రాముఖ్యత గురించి చెప్పడానికి ఈ నవలనూ, అందులోని చివరి సన్నివేశాన్ని నిత్యం ఉదాహరణగా చెబుతుంటాను. వర్గపోరాటమే సామాజిక పురోగమనానికి ఛోదక శక్తి అని కారల్ మార్క్స్ చెప్పన మాటల్ని ఫాస్ట్ ఈ నవల ద్వారా కళాత్మకంగా వివరించాడు. గిడియన్, ఆయన ప్రజలూ చేసిన పోరాటంలో వారు గెలిచారా, ఓడారా అంటే ఏం చెబుతాం? ఓడారంటామా? కార్వెల్ వాసులంతా చనిపోయారుకనుక, మామూలుగా చూస్తే ఓడినట్లే అనిపిస్తుంది. గిడియన్ కన్న కల...విశ్వమానవ జాతి ఉద్భవం ఇంకా జరగ లేదు కనుక ఆయన ఆశ ఫలించలేదనిపిస్తుంది. కమ్యూనిస్టులు చాలా సార్లు చేసిన పోరాటాలు అలాగే అంతమవుతుంటాయి. పోరాటం జరుగుతుంది. నిర్బంధంతో అంతమైపోతుంది. కొన్ని సార్లు రక్తపుటేరుల్లో మునిగి అదృశ్యమైపోతుంది. కాని ఈ పోరాటాలు ఏమీ సాధించలేదు అంటే అది అవివేకమే అవుతుంది.

విముక్తి మార్గం పోరాటాలతో నిర్మితమై ఉంటుందని చెప్పిన నవల "స్వేచ్ఛా పథం"

మనం చదివే గ్రంథాల్లో విజ్ఞానాన్నిచ్చేవి, వినోదాన్ని పంచేవి, స్ఫూర్తిని నింపేవీ చాలా ఉంటాయి. అత్యంత ఎక్కువ స్ఫూర్తినిచ్చే ఒక పుస్తకాన్ని గురించి చెప్పమంటే ఎలా చెప్పాలి? బహుశా మన జీవితంలోని అనేక సందర్భాల్లో గుర్తుకు వస్తూ, పనిలో ఉత్సాహాన్నిస్తూ, కష్టాల్లో ఉన్నప్పుడు వెన్నుతడుతూ మన జీవిత పరమావధిని నిత్యం గుర్తు చేసే గ్రంథానికి అటువంటి అర్హత ఉంటుందనుకుంటాను. ఇటువంటి నిర్వచనంతో చూస్తే నామట్టుకు నేను చాలా పుస్తకాల గురించే చెప్పాలనుకుంటాను. అయితే వీటన్నిలోకీ హోవార్డ్ ఫాస్ట్ రాసిన 'స్వేచ్ఛా పథం' (ఫ్రీడం రోడ్) నవలకు మొదటి మార్కులు వేస్తాను. భూమి, విద్య... ఈ రెండూ మానవ విముక్తికి ఎంతగొప్ప సాధనాలో రచయిత ఈ నవలద్వారా అత్యద్భుతంగా చెప్పాడు.



అమెరికాలో అంతర్యుద్ధం ముగిసిన తరువాత అప్పటివరకు బానిసలుగా జీవించిన నల్లజాతివారు నిజమైన విముక్తికోసం పడ్డ పాట్లు, వారిని తిరిగి బానిసలుగానే ఉంచడం కోసం పాలకపక్ష శక్తులు జరిపిన జాత్యహంకార దాడులు, వాటిని ఎదుర్కొని నిలవడం కోసం పేద తెల్లజాతి రైతులతో కలిసి మాజీ బానిసలు జరిపిన పోరాటం వంటి చారిత్రక ఘట్టాలను తీసుకుని ఫాస్ట్ ఈ నవల రాశాడు.

నవల చదువుతో ప్రారంభమై చదువుతో ముగుస్తుంది. గిడియన్ జాక్సన్ అనే నల్లజాతి మాజీ బానిస ఈ నవలలో కథానాయకుడు. దక్షిణ కరోలినా రాష్ట్రంలోని కార్వెల్ జమీందారు, అంతర్యుద్ధంలో జమీని ఖాళీ చేసి వెళ్లిపోగా అక్కడ బానిసలుగా పనిచేసిన నల్లజాతి కుటుంబాలూ, కొన్ని తెల్లజాతి పేద కౌలు రైతు కుటుంబాలూ స్వేచ్ఛపొంది భూమి సాగుచేసుకుంటుంటాయి. ఎన్నికలు, ఓట్లు అంటే తెలియని కార్వెల్ నల్లజాతీయులు చార్ల్‌స్టన్ పట్టణానికి పోయి ఓట్లు వేసి రావడంతో కథ ప్రారంభమవుతుంది. కార్వెల్‌లో నాలుగు అక్షరం ముక్కలు వచ్చిన గిడియన్‌ను తమ ప్రాంత శాసనసభ్యునిగా నల్లజాతీయులు ఎన్నుకుంటారు. గిడియన్ కాలినడకన చార్ల్‌స్టన్ పట్టణానికి వెళ్లి శాసన సభ సమావేశాల్లో పాల్గొంటాడు. శాసన సభలో చదువు ప్రాముఖ్యత గురించి, నిర్బంధ విద్యాచట్టం చేయాల్సిన అవసరం గురించి గిడియన్ ప్రసంగిస్తాడు. చట్టాలు చేస్తారు. జాతివివక్షత అంతమైనట్లు కూడా చట్టం చేస్తారు. చదువు యొక్క ప్రాముఖ్యతను బాగా వంటబట్టించుకున్న గిడియన్ తన పెద్ద కొడుకును పట్టణానికి పంపి డాక్టర్ చదివిస్తాడు. శాసన సభ సమావేశాలకు వెళ్లేప్పుడు తనకు ఎదురైన మరో మాజీ బానిస అలెన్‌బీతో కార్వెల్‌లో ఒక పాఠశాల ప్రారంభిస్తాడు. అక్కడ నల్లజాతి పిల్లలతోబాటు, పేద తెల్లజాతి రైతు బిడ్డలు కూడా కలిసి చదువుకుంటుంటారు.

ఇవన్నీ చేసే క్రమంలో గిడియన్‌కు ఒక పెద్ద సమస్య ఎదురవుతుంది. అది భూమి సమస్య. మాజీ జమీందారు భూములను గిడియన్ గ్రామస్తులంతా సేద్యం చేసుకుని బ్రతుకుతున్నారు. కాని ఆ భూముల మీద వారికి హక్కు లేదు. ఇప్పుడేమో ప్రభుత్వం, దక్షిణాది జమీల్లోని భూములన్నిటినీ వేలానికి పెట్టింది. కార్వెల్ భూములను ఎవరైనా వేలం పాడుకుంటే అప్పుడు తమకు మళ్లీ బానిస బ్రతుకులే తిరిగి వస్తాయి. పోనీ తాము ఆ భూములను వేలంలో కొనుక్కుంటే...తమ వద్ద చిల్లిగవ్వ లేదు. అప్పుడే తమ ప్రాంతంలో ప్రారంభమైన రైల్వే లైను నిర్మాణ పనులకు వెళ్లి కార్వెల్ వాసులంతా కలసి వెయ్యిడాలర్లు పోగుచేస్తారు భూమి కోసం. మిగిలిన డబ్బు బ్యాంకులో అప్పుతీసుకుని, వేలంలో మంచి భూమి కొనుక్కుని సేద్యం చేసుకోవాలనుకుంటారు. కాని బ్యాంకర్లు నల్లజాతీయులకు అప్పు ఇవ్వ నిరాకరిస్తారు. "నిగ్గర్ (నీగ్రో) గాళ్లకి సొంత భూమి, సొంత సాగు ఉంటే ఇంకేమైనా పనికొస్తారా? భూమి వేలం పాడుకున్న తెల్లదొరల దగ్గర కూలిచేసుకు బ్రతక్కుండా

సొంతభూమీ, దానికోసం బ్యాంకు అప్పుల బాదరబందీ అంతా ఎందుకు. పొండిరా వెధవల్లారా!" అని వారి మొహమ్మీందే బ్యాంకర్లు తూలనాడతారు.

చదువు కోసం, వర్ణవివక్ష అంతం కోసం, స్వేచ్ఛకోసం, సమానత్వంకోసం....వీటన్నిటికోసం ఎన్ని చట్టాలు చేసినా భూమి కోసం చట్టాలు చేయకుండా, భూమి మీద హక్కులు సాధించుకోకుండా నిజమైన విముక్తి లభించదని గిడియన్ గుర్తిస్తాడు. కాని అప్పటికే చేయిదాటిపోయింది. భూములు వేలానికి వచ్చాయి. కనుక తన పలుకుబడినంతా ఉపయోగించి, అమెరికా ఉత్తరాది రాష్ట్రాల్లో బానిసత్వం రద్దు కోరుకునే తెల్లజాతీయుల సహకారంతో గిడియన్, ఆయన గ్రామస్తులు భూములను వేలంలో కొనుక్కుంటారు. సేద్యం చేస్తారు. పిల్లలకు చదువు చెప్పించుకుంటారు. ఈ విషయంలో నల్లజాతి మాజీ బానిసలతో, తెల్లజాతి పేద రైతులు ఐక్యంగా పనిచేస్తారు. కాని ఆ స్వేచ్ఛా గీతం కొన్నాళ్లే వినిపిస్తుంది. ముళ్లూ, రాళ్లూ ఏరుకుని, కష్టాలను అధిగమించి వారు పయనించిన స్వేచ్ఛాపథంలో జాతివివక్ష అనే అడ్డుగోడ ఎదురవుతుంది. అభివృద్ధి నిరోధక శక్తులు ప్రజా పురోగమనాన్ని అడ్డుకోజూస్తాయి. క్లు క్లక్స్ క్లాన్ పేరుతో ఏర్పడిన తెల్లజాతి దురహంకార సంస్థలకు పాలక పక్షాల మద్దతు లభిస్తుంది. నల్లజాతీయులను తిరిగి బానిసలుగా మార్చడానికి ఏర్పడ్డ సంస్థ అది. నల్లజాతీయులు, వారితో చేయికలిపిన తెల్లజాతి పేద రైతులపై ఈ సంస్థ పెద్ద ఎత్తున దాడులు చేస్తుంది. అధికారులు, పోలీసు యంత్రాంగం వారికే మద్దతు పలుకుతుంది. దాడులనుండి కార్వెల్‌లోని తమ పొలాలనూ, తమ బ్రతుకులనూ, కొత్తగా లభించిన తమ స్వేచ్ఛనూ కాపాడుకోడానికి సాయుధులై పోరాడ్డం తప్ప గత్యంతరం లేని పరిస్థితులకు నల్లజాతి ప్రజలూ, వారి మిత్రులూ నెట్టబడతారు.

కార్వెల్ పోరాటానికి గిడియన్ జాక్సన్ నాయకత్వం వహిస్తాడు. తెల్లజాతి దురంహకారులు గ్రామం మీద పడి బీభత్సం సృష్టిస్తుంటే గ్రామంలోని మొత్తం ప్రజలు మాజీ జమీందారు కోటను స్థావరంగా చేసుకుని పోరాడతారు. కాని వారి పోరాటం నిలవదని తెలుసు. ఎందుకంటే శత్రువు అప్పటికప్పుడు వారికన్నా శక్తిమంతుడు. కాని విముక్తి కావాలా? బానిసత్వం కావాలా? అన్న రెండే మార్గాలు వారి ముందున్నాయి. విముక్తి కావాలంటే పోరాట మార్గం పట్టాల్సిందే. రాజీ మార్గం వారిని తిరిగి బానిసత్వంలోకి చేరుస్తుంది. అందువల్ల గిడియన్, ఆయన ప్రజలు పోరాట మార్గాన్నే ఎన్నుకుంటారు. శత్రువు చుట్టుముట్టి ప్రజలు నివసిస్తున్న కోటను ఫిరంగి గుళ్లతో కూల్చి వేస్తుంటారు. గిడియన్, గ్రామంలోని యువకులు, పురుషులు కోటను రక్షిస్తుంటే కోట లోపల ఆ పోరాటం మధ్యలోనే పిల్లలకు పాఠాలు చెబుతూ ఉంటారు. "చదువు చెప్పటడం మానకండి, చదువుకోవడం ఒక్క క్షణం కూడా ఆగకూడదు" ఇదే గిడియన్ కోరిక. చివరికి ఫిరంగి గుళ్లదెబ్బకు కోట కుప్పకూలిపోతున్నప్పుడు కూడా అందులో చదువు చెప్పడం, నేర్చుకోవడం కొనసాగుతూనే ఉంటుంది. ఆ చివరి క్షణంలో కూడా 'సాహసోపేతమైన ఆ పోరాటం నుండి భవిష్యత్తులో విశ్వ మానవ జాతి ఉద్భవించగలదనే ఆశా, విశ్వాసం" గిడియన్ మదిలో ప్రకాశిస్తుంటాయి.

మార్క్సిస్టు దృక్పథంతో నవలలు రాసిన కొద్దిమంది అమెరికన్ రచయితల్లో హొవార్డ్ ఫాస్ట్ ఒకరు.1914లో జన్మించి 2003లో మరణించిన ఫాస్ట్ 2001 వరకు అనేక నవలలు రాశాడు. వాటిలో ప్రస్తుత నవలతో పాటు, ఇమ్మిగ్రెంట్స్, స్పార్టకస్ వంటి అనేక ప్రజాదరణ పొందిన నవలలు ఉన్నాయి. అనేక భాషల్లోకి అనువదించబడ్డాయి. స్వేచ్ఛాపథం నవల తెలుగులోకి అనువదించబడింది. రంగనాయకమ్మ పరిచయం పేరుతో చిన్న పుస్తకం రాశారు. పాత అనువాద నవలను కీర్తి శేషులు పోలవరపు కోటేశ్వరరావుగారు నాకు ఇచ్చారు. ప్రజాశక్తి ద్వారా పునర్ముద్రణ పొందాలన్నది వారి ఆలోచన. ఆ నవల చదువుతున్నప్పుడు నేను విపరీతమైన భావోద్వేగానికి లోనైనాను. పిల్లలకు గాని, పెద్దలకు గాని చదువు యొక్క ప్రాముఖ్యత గురించి చెప్పడానికి ఈ నవలనూ, అందులోని చివరి సన్నివేశాన్ని నిత్యం ఉదాహరణగా చెబుతుంటాను. వర్గపోరాటమే సామాజిక పురోగమనానికి ఛోదక శక్తి అని కారల్ మార్క్స్ చెప్పిన మాటల్ని ఫాస్ట్ ఈ నవల ద్వారా కళాత్మకంగా వివరించాడు. గిడియన్, ఆయన ప్రజలూ చేసిన పోరాటంలో వారు గెలిచారా, ఓడారా అంటే ఏం చెబుతాం? ఓడారంటామా? కార్వెల్ వాసులంతా చనిపోయారుకనుక, మామూలుగా చూస్తే ఓడినట్లే అనిపిస్తుంది. గిడియన్ కన్న కల...విశ్వమావన జాతి ఉద్భవం ఇంకా జరగ లేదు కనుక ఆయన ఆశ ఫలించలేదనిపిస్తుంది. కమ్యూనిస్టులు చాలా సార్లు చేసిన పోరాటాలు అలాగే అంతమవుతుంటాయి. పోరాటం జరుగుతుంది. నిర్బంధంతో అంతమైపోతుంది. కొన్ని సార్లు రక్తపుటేరుల్లో మునిగి అదృశ్యమైపోతుంది. కాని ఈ పోరాటాలు ఏమీ సాధించలేదు అంటే అది అవివేకమే అవుతుంది. హొవార్డ్ ఫాస్ట్ నవల్లోని పోరాటాల్లాంటివి అమెరికా దక్షిణ రాష్ట్రాల్లో చాలానే జరిగాయి. వాటిపై అభివృద్ధి నిరోధక పాలకపక్షాలు దాడులు చేశాయి. అణచివేశాయి. కాని ఆ పోరాటాలు ఫలితమివ్వకుండా పోలేదు. నల్లజాతీయుల విముక్తికి ఆ పోరాటాలు ఎంతో కొంత తోడ్పడ్డాయి. అటువంటి పోరాటాల పరంపర ఫలితమే నేడు అమెరికాలో నల్లజాతి పౌరులు అనుభవిస్తున్న హక్కులు. ఫాస్ట్ రాసిన స్పార్టకస్ నవలలో కూడా బానిసల పోరాటాన్ని రోమన్ సామ్రాజ్యం రక్తపాతంలో అణచివేస్తుంది. కాని స్పార్టకస్ పోరాటం ఓడిపోయిందని చెప్పలేం. ఎందుకంటే ఆ పోరాటాలే చివరికి రోమన్ సామ్రాజ్యాన్ని కుప్పకూల్చాయి. బానిస సమాజం పతనమై కొత్త సమాజం ఏర్పాటుకు కారణమైనాయి.



హొవార్డ్ ఫాస్ట్

పోరాటం విజయవంతమైందా లేదా అనేదికాదు పోరాటం జరిగిందా లేదా అనేది ముఖ్యం. చరిత్రలో నేరుగా విజయం సాధించిన పోరాటాలు తక్కువ. అణచివేయబడ్డవే ఎక్కువ. ఓడిపోయినవే అధికం. కాని ఓడిపోయిన ప్రతిపోరాటమూ మార్పుకు కారణమైంది. పోరాటం తరువాత పోరాటం విముక్తి పథాన్ని నిర్మించుకుంటూ పోయాయి. స్వేచ్ఛాపథం నవల మనకు ఈ సత్యాన్ని బోధిస్తుంది. ఈ నాడు మనలో చాలా మందిమి ఒక పోరాటాలు విజయం సాధిస్తే సంతోషిస్తాం. ఓడిపోతే నిరాశపడతాం. పోరాట పథంలో ఉన్న వారికి అది సహజం కూడా. కాని గెలుపోటములతో నిమిత్తం లేకుండా ప్రతిపోరాటమూ మనల్ని లక్ష్యంవైపు ఒక మెట్టు తీసుకుపోతుందన్న వాస్తవాన్ని మనం దృష్టిలో పెట్టుకుంటే మనకు నిరుత్సాహం రాదు. పోరాట స్ఫూర్తి చెరిగిపోదు.

అందువల్ల పోరాటం విజయవంతమైందా లేదా అనేదికాదు పోరాటం జరిగిందా లేదా అనేది ముఖ్యం. చరిత్రలో నేరుగా విజయం సాధించిన పోరాటాలు తక్కువ. అణచివేయబడ్డవే ఎక్కువ. ఓడిపోయినవే అధికం. కాని ఓడిపోయిన ప్రతిపోరాటమూ మార్పుకు కారణమైంది. పోరాటం తరువాత పోరాటం విముక్తి పథాన్ని నిర్మించుకుంటూ పోయాయి. స్వేచ్ఛాపథం నవల మనకు ఈ సత్యాన్ని బోధిస్తుంది. ఈ నాడు మనలో చాలా మందిమి ఒక పోరాటాలు విజయం సాధిస్తే సంతోషిస్తాం. ఓడిపోతే నిరాశపడతాం. పోరాట పథంలో ఉన్న వారికి అది సహజం కూడా. కాని గెలుపోటములతో నిమిత్తం లేకుండా ప్రతిపోరాటమూ మనల్ని లక్ష్యంవైపు ఒక మెట్టు తీసుకుపోతుందన్న వాస్తవాన్ని మనం దృష్టిలో పెట్టుకుంటే మనకు నిరుత్సాహం రాదు. పోరాట స్ఫూర్తి చెరిగిపోదు.

★

విజ్ఞాన వీచిక



ప్రమాదకర ప్రయోగం

- డా॥ విజయ్

ఏ శాస్త్రీయ ప్రయోగాన్నీ కావాలని ప్రమాదాలను సృష్టించడానికి చేయరు. అది ఎక్స్‌రే అయినా, అణుశక్తి అయినా. కానీ కొంతమంది విపరీతబుద్ధి కలవాళ్లు శాస్త్రీయ ఫలితాలను తమ స్వార్థం కోసం వాడుకునే క్రమంలో విపరీత పరిణామాలు బయల్పడుతూ వుంటాయి. అడపా దడపా విచిత్ర మనస్తత్వంగల శాస్త్రవేత్తలు కూడా పనిగట్టుకుని దుష్ఫలితాలకోసం ప్రయత్నిస్తుంటారు – అది అరుదు.

కానీ, ముందు ఊహించినట్టు సత్ఫలితాలనే ఇచ్చినా, ఆ తరువాత కొద్దికాలానికి ఎవరూ ఊహించని ప్రమాదాలు పుట్టుకొచ్చే ప్రయోగాలు ఈమధ్యే అధికంగా జరిగాయి. పిండం తాలూకు లింగమేదో తెలుసుకోవడం శాస్త్రీయపరంగా ప్రగతే అయినా, అది తెలుసుకుని భ్రూణహత్యకు పాల్పడడం దుష్పరిణామం. అలాగే మూలకణాలను వాడి వ్యాధులను నివారించవచ్చని తెలిసిన తరువాత ఆ కణాలకోసం పిండాలను చంపడం అనే వంక దొరుకుతుందన్న భయం పెరిగింది. క్లోనింగ్ ద్వారా వ్యవసాయంలోనూ, పశు పరిశ్రమలోనూ మంచి ఫలితాలను పొందవచ్చునుకుంటే అదే ప్రక్రియ ద్వారా హానికర ఫలితాలనూ సాధించే ప్రమాదం పొంచి వుంది. సరిగ్గా ఇదే వరుసలో జెనెటిక్ ఇంజనీరింగ్ శాఖలో జి.ఎమ్ (జన్యు మార్పులు) ఆహార పదార్థాలు రూపొందాయి. అవి తయారైనప్పుడు భవిష్యత్తు అద్భుతంగా అనిపించింది. ప్రపంచ ఆకలిని రూపుమాపుతాయన్న ఆశ జనింపచేసింది. కానీ ఇప్పుడిప్పుడే ప్రతికూల ఫలితాలు బయటకు వస్తున్నాయి.

జన్యుపరమైన మార్పులు చేసిన ఎన్నో కూరగాయలు, వాణిజ్య పంటలు ప్రస్తుతం రైతులను రకరకాల సమస్యలకు గురి చేస్తున్నాయి. అటువంటి కూరగాయలను తినడంవల్ల ఆరోగ్య హానే కాకుండా ఏకంగా ప్రాణహాని కలిగే ప్రమాదముందని నిపుణులు అంటున్నారు.

అమెరికాలో ఈ కరమైన జి.ఎమ్ ఆహారం కనీసం 12 సంవత్సరాల నుండి తీసుకుంటున్నారు. పైగా జి.ఎమ్ సోయా చిక్కుళ్లు, మొక్కజొన్న పంటలు విపరీతంగా పండిస్తున్నారు. అయితే ఇప్పటి వరకూ ఇటువంటి పంటలపై క్షేత్ర స్థాయి అధ్యయనాలు, జంతువులపై పరిశోధనలూ చాలా తక్కువే. కానీ, అధ్యయనం చేసినంతవరకూ మాత్రం ఫలితాలు ఆశ్చర్యంగా వున్నాయి. దాదాపు ప్రతి అవయవంపై జిఎమ్ పంటల ప్రభావం ప్రస్ఫుటంగా కనిపించింది. యుకెలో జి.ఎమ్ సోయా ప్రవేశపెట్టినప్పుడు సోయా అలర్జీలు రెట్టింపయ్యాయి. జి.ఎమ్ పంటలు తినడం వల్ల మానవులపై కలిగే ప్రభావాల అధ్యయనం ఇప్పటివరకూ యు.కెలో మాత్రమే జరిగింది. దాని తాలూకు ఫలితాలు 2004 'నేచర్ బయోటెక్నాలజీ' పత్రికలో ప్రచురితమయ్యాయి.

వాటి ఆధారంగా జి.ఎమ్ సోయాలోని జన్యువు దాని డి.ఎన్.ఎ నుండి మానవుల ప్రేగుల్లో నివసించే బాక్టీరియా డి.ఎన్.ఎలో ప్రవేశించి, జి.ఎం సోయా చిక్కుళ్ల తినడం ఆపేసిన చాలా కాలం వరకూ ప్రభావం చూపుతూనే ఉంటాయని తెలిసింది.

అలాగే మన దేశంలో ప్రవేశ పెట్టిన బి.టి వంకాయలోని జన్యువు మన ప్రేవుల్లోని బ్యాక్టీరియాలో చేరి క్రిమినాశక పరిశ్రమలా జీవితాంతం పనిచేస్తూనే ఉంటుంది. ఎలుకలపై బి.టి మొక్కజొన్నతో చేసిన ప్రయోగాలు కూడా ఎలుకలలో వంధ్యత్వం కలిగే అవకాశాలను వెలికి తెచ్చాయి.

మొత్తానికి జి.ఎమ్ పంటల వల్ల జీవ వైవిధ్యంలో కూడా ప్రమాదం ఏర్పడే అవకాశం వుంది. పైగా భారతదేశం లాంటి దేశాల్లో పంటలపై వివరాలు పొందుపర్చబడవు. అందువల్ల జి.ఎమ్ పంటలు మామూలు పంటలతో పరపరాగ సంపర్కం చెంది, జన్యువులు విస్తారంగా వ్యాపిస్తాయి. అటువంటి పంటలను మట్టుపెట్టడం దాదాపు అసాధ్యం కూడా. మరో కొన్ని దశాబ్దాల తరువాత జి.ఎమ్ పంటల తాలూకు హానిని చవిచూస్తూనే, వాటి గురించి ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో పడబోతున్నామని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

జీవ సాంకేతిక పరిజ్ఞానం ఏదో మంచి చేయబోయి కీడుతో జతకట్టడానికి సజీవ ఉదాహరణ జన్యుమార్పిడి పంటలు. ఇంకా శైశవ దశలో ఉన్న ఈ పరిజ్ఞానాన్ని మనం కోట్లాది మంది శరీరాల్లోకి పంపిస్తున్నాం. మళ్లీ వెనక్కి తీసుకోలేని విధంగా వాటిని పర్యావరణంలోకి వదిలిపెడుతున్నాం. దీనికి ఎక్కడో ఆనకట్ట పడాలి.

★





అక్కడ పరిసరాల పరిశుభ్రతకు, పర్యావరణ పరిరక్షణకు, ఆరోగ్యాన్నిచ్చే ఆహారానికి వారు ఎంతో ప్రాధాన్యతనిస్తారు. ఆ వివరాలేంటో చూద్దామా...!

తిరువనంతపురం తీరే వేరు!

- కారుసాల శ్రీనివాసరావు

కొత్త ప్రదేశాలు చూడాలని అనుకునేవారికి కేరళ తప్పక కనువిందు చేస్తుంది. రైలు ప్రయాణం మరింత ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ నుండి వెళ్ళే రైళ్ళన్నీ కేరళలో పగలు ప్రయాణించటం విశేషం. గుబురుగా చెట్లున్న చల్లని ప్రదేశంలోకి ప్రవేశించామంటే అది కేరళ అని అర్థం చేసుకోవచ్చు.

మే 18న ఆంధ్రప్రదేశ్‌లో ఎండలు మండుతున్నాయి. మే 19 న కేరళలో చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. మైళ్ల పర్యంతం పచ్చదనం పరచుకొని చూపరులకు కనువిందు చేస్తోంది.

ప్రతి గట్టుమీద చెట్లు విస్తారంగా ఉన్నాయి. తాటి, కొబ్బరి, టేకు, పనస, మామిడి, సపోటా చెట్లు అల్లుకొని ఉన్నాయి. ఇళ్ళ చుట్టూ చెట్ల మయం. ప్రతి ఇంటి ముందు అనేక రకాల చెట్లు. ప్రహరీ గోడలుగా చెట్లనే పెంచుతున్నారు.

ఇక్కడ ఇళ్ళన్నీ ఒక చోట లేవు. మన గ్రామాల వలె అక్కడ కనిపించలేదు. చెట్ల మధ్యలో అక్కడక్కడా కొద్దికొద్దిగా ఇళ్ళు. కాలిబాటలు, చిన్నరోడ్లు.

ఇళ్లన్నీ ఎర్రపెంకుతో కప్పబడినవే. కొబ్బరి ఆకుల పందిళ్ళు, ప్రహరీలు విరివిగా ఉన్నాయి.

మేం తిరువనంతపురంలో మూడు రోజులున్నాం. అక్కడ మాకు కొన్ని ప్రత్యేకతలు కనిపించాయి. పరిసరాల పరిశుభ్రతకు, పర్యావరణ పరిరక్షణకు, ఆరోగ్యాన్నిచ్చే ఆహారానికి వారు ఎంతో ప్రాధాన్యతనిస్తారు. ఆ వివరాలేంటో చూద్దామా...!

తిరువనంతపురంలో ఆకాశహర్మ్యాలు లేవు. క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా చెప్పుకోవచ్చు. చెత్తకుప్పలు ఎక్కడా కనబడలేదు.

రాత్రి 8.30 కి రైలు దిగి మెయిన్ రోడ్‌కు వచ్చి చూస్తే పెద్దగా జన సంచారం లేదు. అక్కడక్కడా కొన్ని ఆటోలు తిరుగుతున్నాయి. ఎక్కువ భాగం షాపులను అప్పటికే మూసివేశారు.

వేడినీళ్ళు

ఉదయాన్నే టిఫిన్ తిందామని "ఇండియన్ కాఫి హౌస్" కు వెళితే వేడినీళ్ళు స్వాగతం పలికాయి. అక్కడ అన్ని హోటళ్ళలో తాగటానికి వేడినీళ్ళు ఇస్తారనేది దాని సారాశం. కేరళలో ఉన్నన్ని రోజులు కాచి చల్లార్చిన నీరే ప్రతి హోటల్ లోనూ దర్శనమిచ్చాయి.

ప్లాస్టిక్ నిషేధం

మన ఆంధ్రాలోలాగా తిరువనంతపురంలో ప్లాస్టిక్ వాడకం లేదు. అన్ని వ్యాపార సంస్థలలోను కాగితాల కవర్లనే ఉపయోగిస్తున్నారు. హోటళ్ళు, టీస్టాళ్ళలో గాజు గ్లాసులు, పింగాణీ పాత్రలు విరివిగా వాడుతున్నారు. ప్లాస్టిక్ చెత్తకుప్పలు ఎక్కడా లేవు.

దేశీయవైద్యానికి ప్రోత్సాహం

కేరళలో ఎక్కడ చూసినా ఆయుర్వేద వైద్యశాలలు విరివిగా కనిపిస్తాయి. ప్రభుత్వ ప్రోత్సాహంతో, ఆయుర్వేద వైద్య కళాశాలలు నడుస్తున్నాయి. 'త్రిసూర్' లో ప్రభుత్వ ఆయుర్వేద మందుల తయారీ కంపెనీ ఉంది. తిరువనంతపురం బజార్లలో అల్లోపతికి పోటీగా ఆయుర్వేద మందుల షాపులను మనం చూడవచ్చు.

ఆహారం

అక్కడ ఉప్పుడు బియ్యంతో వండిన అన్నం తింటున్నారు. బియ్యం ఉడకబెట్టి ఆరబెట్టడం ద్వారా ఈ రకం బియ్యం వస్తాయి. బియ్యం లోని పోషక విలువలన్నీ వెంట తెచ్చుకోవడం ఈ బియ్యం విశేషం. చేపలు విరివిగా వాడుతారు. బీఫ్ కర్రీ ఆహారంలో సర్వసాధారణంగా కనిపిస్తుంది. ఆహార పదార్థాల ధరలు తక్కువగా వున్నాయి. ప్లేట్ మీల్స్ 19 రూపాయలు, చపాతీ 2, పరోటా 3 (కూర అదనం), సాదా దోసె 10, మసాలా దోసె 16 రూపాయలు.

చూడదగ్గ ప్రదేశాలు

తిరువనంతపురానికి దగ్గరలోనే 'కోవలం బీచ్' చూడదగ్గ ప్రదేశం. కాఫీ తోటల నిలయం 'పొన్ ముడి' ఆ రోజుల్లోనే మరో చూడదగ్గ ప్రదేశం. గతవైభవానికి చిహ్నంగా పద్మనాభస్వామి ఆలయం తిరువనంతపురంలోనే ఉంది.

★





సీరియల్

గని

జరిగినకథ:

హక్కులకోసం గొంతెత్తినందుకు యాజమాన్యం గని కార్మికులమీద దాడి చేయిస్తుంది. బికాస్ విపరీతంగా గాయపడతాడు. చుట్టూ ఏం జరుగుతుందో కూడా తెలుసుకోలేని విధంగా పడిపోతాడు. మరుసటి రోజు గనిలో పనికి వెళ్లినవారికి నోటీసుబోర్డు వెక్కిరిస్తూ కనిపిస్తుంది. పని నుంచి తీసేసిన వారి పేర్లు అక్కడ దర్శనమిస్తాయి. అందులో బికాస్ కూడా ఒకడు. ఆ తర్వాత...

తమిళ మూలం : కె. చిన్నప్పభారతి

అనువాదం : వి. వెంకటేశ్వర

(పన్నెండవ భాగం)

ఉద్యోగంలో చేరాలా, వద్దా అని బికాస్ ఆలోచించాడు. పెళ్ళీపెటాకులూ లేవు, కుటుంబ బాధ్యతలూ లేవు. అందువల్ల ఉద్యోగం అతడికి తప్పనిసరి అవసరం కాదు, ఎలాగోలా బతికేయవచ్చు. కార్మిక సంఘానికి తన పూర్తి సమయాన్ని కేటాయించడానికి అతడు మొగ్గు చూపాడు. అయితే కార్మికుల మధ్య చైతన్యమూ, అవగాహనా కలిగేదాకా వాళ్ళ మధ్య ఉండాలనీ, వాళ్ళ భయం పోగొట్టి విశ్వాసం కలిగించాలని భావించి, ఉద్యోగంలో చేరదలిచాడు.

బికాస్ తల్లిదండ్రులు అతడి బాల్యంలోనే కాలంచేశారు. అక్కాబావ అతడ్ని పెంచి పెద్ద చేశారు. అతడ్ని పోలీసులు లాక్కెళ్ళడం, గూండాలు తన్నడం లాంటి సంఘటనలు వాళ్ళను బాధించాయి. తన ఏకైక సోదరుడు ఎందుకిలా కష్టపడాలి అని అక్క తల్లడిల్లింది. తమకు సంతానం లేదు. బికాస్ వ్యవసాయంలో చేదోడువాదోడుగా ఉండి, పెళ్ళి చేసుకొని సుఖపడితే చాలని ఆశపడింది. అయితే బికాస్ ఆలోచనలు మరోలా ఉన్నాయి. సమాజమే తన కార్యరంగం అని అతడి అభిప్రాయం.

బికాస్ గాయపడి, మంచం పట్టినప్పుడు, కళ్ళొత్తుకొంటూ చెప్పింది జమునా కుమారి "బాబూ! కార్మికుల హక్కుల కోసం పోరాడడంలోనే నీ జీవితం గడిచిపోతోంది. యాజమానులందరూ నిన్ను హతమారిస్తే తాము హాయిగా ఉండొచ్చని భావిస్తున్నారు. సమ్మెలు, ధర్నాలు జరిగినపుడల్లా మొట్టమొదట నీ మీదే దాడి జరుగుతుంది. దుర్గమ్మ దయవల్ల ప్రాణాలు నిలిచాయి. ఎందుకొచ్చిన గొడవ..." అంటూ సర్దిచెప్పచూచింది.

వెచ్చని కన్నీరు ఆమె చెక్కిళ్ళపై పారుతోంది. ఆమె ప్రేమకు అతడు చలించిపోయాడు. తల్లిదండ్రులు లేని తన పట్ల అక్కాబావలు చూపించే ప్రేమాభిమానాలూ, ఆదరణ ఎనలేనివి. తన జీవితానికొక సాంఘిక ప్రయోజనం ఉండాలని అతడు భావిస్తుండగా, తమ వంశం అంతరించి పోకుండా ఉండాలని అక్క తాపత్రయపడుతోంది. ఆమెకు ఏం చెప్పాలో అతడికి తోచలేదు. తన గురించి ఆమె కంటున్న కలల్ని తేలిగ్గా ఎలా తీసిపారేయగలడు? మానవ సంబంధాలు తల్లిదండ్రులు, పిల్లలు, బంధువర్గం వరకే పరిమితమా? మరి కార్మికులు తనపట్ల చూపుతున్న ప్రేమాభిమానాల మాటేమిటి?

అతడి మనసులో అలజడి. ఏంచెప్పాలో అది వెంటనే జవాబు చెప్పగలిగిన ప్రశ్న కాదు. రేయింబవళ్ళు తనకు సపర్యలు చేస్తూ, ముక్కోటి దేవతలకు ముడుపులు కడుతోన్న అక్క మొగం మీద ఈడ్చి కొట్టినట్టు జవాబు చెప్పగలడా? పిల్లలు లేని ఆ దంపతులు తననే తమ ఊతక్రరగా భావిస్తున్నారు. వాళ్ళ కలల్ని ఎలా కాలదన్నడం? అతడిలో అశాంతి.

అక్క ఆశలు అతడ్ని అతలాకుతలం చేశాయి. ఆమెకు జవాబు చెప్పలేక ఉక్కిరిబిక్కిరయ్యాడు. దీనికి ప్రత్యామ్నాయం ఏదైనా ఉందేమో ఆలోంచాలి అనుకొన్నాడు. అతడి ముఖంలో అలజడి స్పష్టంగా తెలుస్తోంది. పూలు రాలుతున్నట్టు అతడి చెక్కిళ్ళపై కన్నీటి చుక్కలు రాలుతున్నాయి.

జమునాకుమారిలోనూ అలజడి. తన ఆశల్ని వెలిబుచ్చి అతడ్ని బాధించినా! అనుకొంది. "బాబూ! నేనేమైనా తప్పుగా మాట్లాడానా!"

ఆమె అలా అడగకుండా ఉంటే ఎంత బావుండేది. తన సంవేదనల్ని మెల్లమెల్లగా చిదిమేసి ఉండేవాడు. ఆమె ప్రశ్నలో ఎంత క్షమాగుణం.!

అతడు వెక్కివెక్కి ఏడ్చాడు. కట్టె విరిచి పొయ్యిలో పెట్టినట్టు జవాబు చెప్పలేని నిస్సహాయత అందులో ధ్వనించింది. శరీరం కంపిస్తోంది. తన ఉద్వేగాల్ని బలవంతంగా అణచుకొంటున్నట్లు కింది పెదవిని పళ్ళతో గట్టిగా అదిమి పెట్టాడు.

అక్కకు మనశ్శాంతి కలిగేలా ఏదైనా చెబుదామనుకొన్నాడు. తాత్కాలికంగానైనా ఆమెకు ఉపశమనం కలగదా! అయితే ఆమె దాన్నే గట్టిగా నమ్మితే! నమ్మకం కలిగించి, మధ్యలోనే వేళ్ళు తుంచేసినట్టు తాను తన మార్గంలో వెళ్ళిపోతే, ఆమె తట్టుకోగలదా? ఆబాధ శాశ్వతంగా వేధించదా?

"అక్కా ! మనస్సూ, శరీరమూ ఇంకా నా స్వాధీనంలోకి రాలేదు. తర్వాత మాట్లాడుకోవచ్చు కదా!" అని చెప్పి నిద్రాభారంతో పక్కకు ఒత్తిగిల్లినట్లు ఒత్తిగిల్లాడు.

9

భాద్రపద మాసం. దుర్గాపూజ తాలూకు సందడి. వీధుల్లో పందిళ్ళు వేశారు. పందిళ్ళంటే మామూలు తాటాకు పందిళ్ళు కావు. గుడి ఆకారంలో మలచబడ్డ బ్రహ్మాండమైన ప్లైవుడ్ పలకలతో చేసిన పందిళ్ళు. విద్యుద్దీపాల

కాంతిలో మయసభను మరిపింపజేస్తున్నాయి. ఎత్తైన పీఠం మీద, సువిశాలమైన ఎర్రటి కళ్ళతో బయటికి సాచిన నాలుకతో, త్రిశూలం ధరించిన దుర్గాదేవి... ఆమె పాదాల చెంత మహిషాసురుడు. పక్కనే నరకబడిన ఎనుబోతు తల. మహిసాసురుడు ఘోరతపస్సుతో బ్రహ్మను మెప్పించి మరణం లేకుండా వరం పొందాడు. వరం పొందిన ధీమాతో మానవులనూ, దేవతలనూ పీడించసాగాడు. దేవేంద్రుడ్ని ఓడించాడు. దేవతలు త్రిమూర్తుల వద్దకు వెళ్ళి మొరపెట్టుకోగా, వాళ్ళు పిడుగునూ, మెరుపునూ, ప్రభంజనాన్ని అన్ని దిశలకూ పంపారు. అవి మూడు పరస్పరం విలీనమైన చోట దుర్గాదేవి ఉద్భవించి మహిషాసురుడ్ని, ఇతర రాక్షసులనూ సంహరించి దేవతల్ని కాపాడుతోందని పురాణాలు చెబుతున్నాయి.

వంగదేశ ప్రజలు దుర్గాదేవిని తమ కూతురిగా భావిస్తారు. దుర్గాపూజ తరుణంలో ఆమె ఆకాశం నుంచి దిగివచ్చి పండుగలో పాలుపంచుకొంటుందని విశ్వసిస్తారు. వాళ్ళు సప్తమి, అష్టమి, నవమి, దశమి రోజుల్లో ఘనంగా పూజలు నిర్వహించి ఆమె రాక పట్ల తమ హర్షాన్ని వెలిబుచ్చుతారు.

ప్రతి ఇంటా పాలకోవా, నువ్వుల ఉండలు, కల్మా, కిచిడీ, పాయసం, అరటిపండు వగైరా భోజన పదార్థాలు అతిథుల్ని అలరిస్తాయి.

నిరాడంబరంగా కనిపించే డోరియా చీర, 'గోరా' వంటి వంగ ప్రాంతపు చేనేత వస్త్రాలు స్త్రీలను అలంకరిస్తాయి. పసుపు రాసుకొని స్నానం చేసినట్టు పొలాల ఆవపూలతో కళకళలాడుతుంటాయి. మెడలో వివాహ చిహ్నమేమీ కనిపించదు. తలపాపిట మెరిసే కుంకుమబొట్టే వివాహ చిహ్నంగా భాసిల్లుతుంది.

రాత్రంతా బొమ్మలాట, సరోద్ వాద్యం, 'జాత్ర' అనే వీధినాటకం, నాటకం – ఇలా కోలాహలంగా గడిచిపోతుంది.

ఇరవై వస్తువుల్ని అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు. విజయదశమి నాడు లారీ, ట్రక్కు వంటి వాహనాలల్లో అమ్మవారు, మహిషాసుర విగ్రహాన్ని తీసుకెళ్లి కోనేరు, నది లేదా సముద్రంలో నిమజ్జనం చేస్తారు. దసరా పండగ చివరి రోజున విజయ దశమి నాడు పండగ సందర్భంగా పుట్టింటికి వచ్చిన అమ్మాయిని అత్తగారింటికి సాగనంపుతారు.

అన్నీ బాధలన్నీ మరచిపోయి, వారం రోజుల పాటు పండుగ చేసుకున్నారు. కార్మికులు చేబదులుగా పుచ్చుకున్న డబ్బులు పండగ ఖర్చుగా ఎగిరి పొయ్యాయి. దేవలోకం నుంచి భూలోకం మీద పడ్డట్టుగా జీవిత యదార్థం వాళ్ళను దిగ్భ్రాంతికి గురి చేసింది. వసంతం కాస్త గ్రీష్మంగా మారుతున్నట్టుగా వుంది.

దుర్గా పూజ ముగిసి ఓ నెల గడిచింది. జీతం తీసుకుని ఇంటికి వస్తుంటే ఎలుక కోసం నిరీక్షిస్తున్న పిల్లిలా నిలుచున్నారు అప్పులవాళ్ళు. అందరికంటే ఎక్కువ వడ్డీని వసూలు చేసే ఋణదాత చెట్టునీడలో ఒదిగి కూర్చున్నాడు. అతడి చేతికింది మనుషుల చేతుల్లో లాఠీలు. తన ఎర తప్పిపోకూడదని జాగ్రత్తగా వీక్షించే రాబందుల్లా ఉన్నారు ఋణదాతలు.

పైకి లేచిన దవడ ఎముకలు, చప్పిడి ముక్కు, ఈనెల్లా చెరిగిన జుట్టు కలిగిన ఓ పొట్టివాడు తన జీతం తీసుకొని బయటికి వచ్చాడు. భుజాన వున్న కండువాతో మొగం తుడుచుకుంటున్నట్టుగా మొగాన్ని కప్పి పెట్టి వడివడిగా అడుగులు వేశాడు. కొలను గట్టున జపం చేస్తున్న కొంగ చేప కదలికను పసిగట్టిన వెంటనే తన పొడుగాటి ముక్కును చాచినట్టు కిరాణాకొట్టు వాడు చకచకా వెళ్ళి, అతడి చొక్కా జేబులో చెయ్యిపెట్టి ఉన్నదంతా ఊడ్చేశాడు. ఇది గమనించి కాస్త అజాగ్రత్తగా ఉండిపోయిన ఋణదాతలు అతడ్ని చుట్టుముట్టారు. అతడి జేబులో ఏమిలేదు. మోసపోయిన సారాకొట్టువాడు అడిగాడు.

"ఒరేయ్! అప్పుల వాళ్ళందరికీ తలా కొంచెం ఇచ్చి ఉండొచ్చుకదా!"

అప్పటిదాకా కొయ్యబారినట్టు నిలబడ్డ ఆ కార్మికుడు తమాయించుకొన్నాడు. "ఒంట్లో బావుండక ఈ నెల సరిగా పనికి వెళ్ళలేదు. వెళ్లి ఉంటే అన్ని బాకీలు తీర్చేసేవాడ్ని. సగం జీతమే వచ్చింది. అన్ని బాకీలనూ సగం తీర్చేద్దామనుకున్నా. అయితే కిరాణా కొట్టువాడు మొత్తం లాక్కెళ్ళిపోయాడు. నెలసరి ఖర్చులు ఎలా భరించాలో తెలియడంలేదు" అన్నాడు.

ఎక్కువ మంది కార్మికులు ఇంట్లో వంట సామాగ్రి వుందో లేదో పట్టించుకోరు. అయితే సారా చుక్కకు డబ్బులు కావాలి. ఒకవేళ సారా కొట్టువాడు అప్పివ్వడానికి మొరాయిస్తే, ఎలాగోలా డబ్బులు సమకూర్చుకొంటారు. ఈ సంగతి సారా కొట్టువాడికి బాగా తెలుసు."నిన్ను ఊరికే వదలి పెట్టను. డబ్బు లేకుండా అంగడి వైపు రావద్దు" అన్నాడు.

"అన్నా అలా అనకండి! పనినుంచి దిగాక నీ కొట్టే నాకు దిక్కు. ఎలాగైనా పై నెల నీ అప్పు తీర్చేస్తాను" అంటూ అతడి కాళ్ల పట్టుకున్నాడు.

అతని బలహీనత తెలిసిన సారా కొట్టువాడు, డబ్బులేకుండా వస్తే గుంజానికి కట్టేస్తా. నీ కోతి చేష్టలు నా దగ్గర చెల్లవు" అన్నాడు.

తాగుడుకు పూర్తి బానిసైన ఆ కార్మికుడు "అన్నా వడ్డీ కూడా ఇస్తాను. నన్ను నమ్ము" అని బతిమాలుకున్నాడు.

ఎదురు చూడని విధంగా అతడు వడ్డీ కూడా ఇస్తాననడం సారా కొట్టు వాడికి సంతోషం కలిగించినా బయట పడకుండా "పై నెల బాకీ ముందు తీర్చాలి" అంటూ కొట్టుకేసి నడిచాడు. కార్మికుడు అతడ్ని అనుసరించాడు.

విశాలమైన నుదురు, లోతుకు పీక్కుపోయిన కళ్ళు, గద్దగూడులాంటి జుట్టు, మల్లయోధునిలాంటి దేహ సౌష్టవం కలిగిన ఓ కార్మికుడు జీతం బాట్వాడా చేస్తోన్న వ్యక్తితో "డబ్బులు తక్కువగా వున్నాయి" అన్నాడు. వారాంతపు సెలవు రోజు తప్ప తక్కిన అన్నిరోజులు పనిచేసినప్పటికీ, తనకు తక్కువ జీతం ఇవ్వడాన్ని గమనించి. ఆ వ్యక్తి కోపమూ, హేళన నిండిన స్వరంతో "వెళ్ళి ఇంజనీర్ని అడుగు, ఇక్కడ నిలుచుని ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దు" అన్నాడు.

అతడు ప్రశాంత గంభీర స్వరంతో దృఢంగా అన్నాడు "నా జీతంలో ఎందుకు కోత విధించారో నాకు తెలియాలి. లేని పక్షంలో నేను జీతం తీసుకోను. ఇక్కడి నుంచి కదలను"

వీడు మొండి వాడు. దేనికైనా తెగిస్తాడు. నాకేదైనా జరిగితే నా కుటుంబం వీధిన పడుతుంది. నా తరుపున వకాల్తా పుచ్చుకునే నాథుడు కూడా లేడు. నాకెందుకీ గొడవ అనుకున్నాడేమో, "పోయిన వారం ఇంజనీరుతో గొడవ పడ్డావట కదా అందుకని పదిహేను రోజుల జీతం కత్తరించమని ఆదేశించాడు" అని చెప్పాడు.

స్థూలకాయుడికి బోధపడింది, గడిచిన వారం తాను పని చేస్తున్న చోటుకి ఇంజనీరు వచ్చాడు. ప్లాట్‌ఫాం అంతా నీళ్ళు నిండాయి. వెంటనే నీళ్ళు బయటకు పంపకపోతే గనిలోని స్తంభాలు దెబ్బతింటాయి. బొగ్గును తవ్విపోయడం వీలుపడదు. ఊరుతున్న నీటిని బావిలాంటి ఓ తొట్టిలోకి పంపి అక్కడ్నుంచి మోటారు ద్వారా బయటికి పంపాల్సివుంటుంది. బొగ్గును తొలుస్తున్నప్పుడే గోడవారగా కాలువ తవ్వుతారు. అప్పుడప్పుడూ అందులో పడే రాళ్ళనూ, బొగ్గుదిబ్బలనూ కూలీల చేత తీయిస్తారు. బొగ్గును తవ్విపోసే కార్మికులు ఈ పని చేయరు. తమకు నిర్దేశించిన లక్ష్యాల్లోనే మోసానికి గురి అవుతోన్న కార్మికులకు ఈ పని చేసేంత వెసులుబాటు ఉండదు.

ఇంజనీరు అతడ్ని చూసి "నీ ఫేజ్‌లోనే కదా నీళ్ళు నిలిచాయి! దాన్ని తొలగించే బాధ్యత నీదే కదా" అన్నాడు.

అతడు 'మీరు తవ్వి పోయమన్నంత బొగ్గు తవ్వి పోయడమే మాకు గగనం. దాంతోబాటు అదనపు పని కూడా చెయ్యాలంటే సమయం చాలదు సార్' అన్నాడు సవినయంగా.

పైకి అలా అన్నాడే కానీ మనసులో మాత్రం "పైనుంచి కింది దాకా ఏ స్థాయిలో పనిచేసే వాళ్లపట్ల మర్యాదా, మానవత్వమూ లేకుండా మొరటుగా పని చేయడం రివాజైపోయింది. అట్టడుగు స్థాయిలో శారీరక శ్రమ చేసే కార్మికులను అన్నివిధాల పీడిస్తున్నారు. కడుపాత్రం తీర్చుకోవడం కోసం, మారుమాట్లాడలేక ఎద్దుల్లా పనిచేసుకోవాల్సిఉంది" అనుకున్నాడు.

(ఇంకావుంది)

కవిత్వము

అరుగు



ఉదయం నిద్ర లేచినంతనే
చిరునవ్వుల స్వాగత తోరణాలతో
మా ఇంటి అరుగు నన్నాహ్వానిస్తుంది.
పరుగులాంటి నడకతో వెళ్ళి
చూపులతో పలకరిస్తాను.
పెచ్చులూడిన శరీరమైనా
గచ్చునేలకంటే స్వచ్ఛం సరళం.
అచ్చమైన తెలుగు పలుకులా
తళతళలాడుతుంది.

చూరులోంచి వాన చినుకులు జారినపుడు
మట్టివాసన పరిమళించినా
మరపురాని మానవ సంబంధాలకు
మాతృవుగా శోభిస్తుంది.
పసివాళ్ళ చదువుల వేదికై
పెద్దవాళ్ళ సదమల ప్రోదికై
విజ్ఞాన వీచికల్ని ప్రసరిస్తుంది.
తొలి సంధ్యలో చంద్రుని శీతల చరణాల్ని
ఆకాశంలోంచి వొడిలోకి వొంపుకొని
వీధి హృదిని స్వర్గధామం చేస్తుంది.
తరతరాల జానపద జీవన విధానానికి
మా ఇంటి అరుగొక నిస్వార్ధ జీవన ప్రవాళిక.
ఒకప్పుడు పురాణ ఇతిహాసాల
రసోజ్వల పఠన ప్రహేళికవుతుంది.
మరొకప్పుడు సాహితీ సమరాంగణ
ఆనంద రసానుభూతి ప్రాంగణ మవుతుంది.
విశ్వ విహంగ వీక్షణ నేత్రమై
విమల వినమ్ర కోకిలగాత్రమై
స్నేహదీప్తిని వెలిగించే సుధామాధురవుతుంది.
మనో యవనికపై విభిన్న భావ చిత్రాలు
చిత్రించే రూప శిల్పి మా ఇంటి అరుగు.

చెట్టు

వృక్షమూలాలు ఖండితమైన చోట
పత్రహరిత పరిమళాల నవ్వులుండవు.
తీగతల్లి కంఠానికి ఉరి బిగించిన చోట
పసిడిఛాయల సోయగాల పువ్వులుండవు.
ప్రకృతికి ఆహ్వానం పలుకుతున్నాడు.
మనిషికి మంచి ముత్యాలందించి
హృదయ పుటావిరులను పోకార్చిన తరువు
వియత్తలంలోకి దృక్కులు సారించే మేరువు.
మౌన భాషతో మట్టి గుండెను కరిగించి
పచ్చని కొమ్మల వెచ్చదనంతో
 కల్పవల్లిలా పరవశించి చిరుజల్లుగా
రాలుతున్న చినుకుల సింగారాన్ని
ఆకుల కురులలో దాచుకున్న బంగారు తల్లి చెట్టు.
మనిషి విడిచే విషపూరిత వాయువుల్ని స్వీకరించి
కన్నీరు తుడిచిన కామధేనువు చెట్టు.
కోటాను కోట్ల జీవావరణానికి
ఆప్తమిత్రువైన వృక్ష జాలానికి

ఆనంద కందళిత హృదయాలతో
స్వాగతించడం   మన విధి.
విత్తు చిన్నదైనా విశాల వృక్షమవతరించినట్లు
సంకల్పం చిన్నదైనా సాధన ఫలిస్తుంది
చెట్టుకు జీవం పోసినవాడు
ప్రకృతికి ప్రతిరూపమై నిలిచిపోతాడు.

- సి.కామేశ్వరరావు

మొట్టమొదటి గ్రీటింగ్ కార్డు

గ్రీటింగ్ కార్డులు పంపడమనే ఆచారాన్ని మొట్ట మొదటగా హెన్రీకోల్ అనే బ్రిటీష్ వ్యాపారవేత్త మొదలు పెట్టాడు. ఈయన చాలా బిజీగా వుండేవాడు. అందువల్ల అంతకుముందు వరకూ లెటర్లు రాసినా ఒక సంవత్సరం క్రిస్టమస్ పండుగకు లెటర్లు రాయలేక ప్రఖ్యాత లండన్ ఆర్టిస్ట్ జాన్ హార్స్లీ చేత ఒక కార్డును డిజైన్ చేయించాడు. దాన్ని ప్రింట్ చేయించి తన స్నేహితులకు పంపించాడు. హార్స్లీ కార్డుపై మూడు బల్లలను డిజైన్ చేశాడు. అందులో మధ్యబల్ల చుట్టూ మనుషులు నిలబడి పార్టీ చేసుకుంటున్నట్లుగా వుంటుంది. కార్డుమీద మెర్రీ క్రిస్టమస్ అండ్ హ్యాపీ న్యూ ఇయర్ టు యు అనే సందేశముంటుంది. మెర్రీ అనే పదాన్ని ఆ రోజుల్లో 'పవిత్రమైన', 'ఆశీర్వదించు' అనే పదాలకు సమానార్థకంగా వాడేవారు. ఈ డిజైన్ ఆధారంగా కోల్ వెయ్యి కార్డులను ప్రింట్ చేయించాడు. వాటిలో డజను కార్డులు ఇప్పటికీ కొందరు ప్రైవేటు వ్యక్తుల వద్ద భద్రంగా వున్నట్లు గుర్తించారు. హార్స్లీ డిజైన చేసిన ఈ కార్డే మొట్ట మొదటి క్రిస్టమస్ కార్డుగానూ, మొట్ట మొదటి గ్రీటింగ్ కార్డుగానూ గుర్తింపు పొందింది.

తెలుసా!

దయ్యందీవి

ఈశాన్య దక్షిణ అమెరికాలోని ఫ్రెంచి గినియా తీరంలో ఓ చిన్న దీవి వుంది. దానిపేరు దయ్యం దీవి (డెవిల్స్ ఐలాండ్). అయినప్పటికీ అక్కడ దయ్యాలేవీ లేవు. వాస్తవానికి ఈ దీవిని చాలా సంవత్సరాల పాటు రాజకీయ ఖైదీలను అమానుష హింసలకు గురిచేసే శిబిరంగా వినియోగించారు. 1790 ప్రాంతాల్లో ఫ్రెంచి విప్లవం సందర్భంగా ఫ్రెంచ్ గినియాకు ఖైదీలను పంపించడం మొదలు పెట్టింది. ఫ్రాన్స్ అది 20వ శతాబ్దం మధ్య వరకూ కొనసాగింది. అప్పట్లో దయ్యం దీవి పేరెత్తితేనే ఫ్రాన్స్‌లోని వారంతా భయంతో వణికిపోయేవారు. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి గతించింది. 1938 నుండి ఈ దీవికి ఖైదీలను పంపించడం ఆపివేసింది ఫ్రాన్స్. ఇక్కడి ఆఖరు ఖైదీని 1946 లో విడుదలచేశారు.





చీమల వంతెన

అమెజాన్ పరిసర ప్రాంతాలలోనూ ఆఫ్రికాలోనూ కన్పించే ఎసిటన్ చీమలు మూకుమ్మడిగా పెద్ద సంఖ్యలో ఒక చోట నుండి వేరే చోట్లకు తరలిపోతుంటాయి. దారిలో దొరికినవి తింటూ మార్గ మధ్యలో ఏవైనా వాగులు లేదా నదులు అడ్డొచ్చినా అవి తమ ప్రయాణాన్ని ఆపవు. ఒకదానినొకటి పట్టుకొని గట్టి గోలుసులా ఏర్పడతాయి. మిగిలినవి వాటి మీద నుండి నడచి ఆవలవైపుకు పోతాయి. ఒక్కోసారి ప్రవాహం ధాటి ఎక్కువగా ఉంటే ఫోటోలో కన్పిస్తున్నట్లుగా ప్రవాహం వున్నా ఇవి మాత్రం గట్టిగా ఒకదానినొకటి పట్టుకొని ప్రయాణిస్తాయి. ఆవలి ఒడ్డు చేరగానే ఇవి మరలా వరుసలలో తమ ప్రయాణాన్ని సాగిస్తాయి.

తండ్రి బాధ్యత



నీటిలో జీవించే వాటర్ బోట్‌మన్‌లనబడే చిన్న పురుగుల జీవన విధానం చాలా విచిత్రంగా వుంటుంది. ఈ పురుగుల్లో ఆడ పురుగుల కన్నా మగవి కొంచెం చిన్నవిగా వుంటాయి. గుడ్లు పెట్టే సమయంలో ఆడ పురుగులు మగ పురుగులను బలవంతంగా పట్టుకొని వాటి వీపుపై గుడ్లను పెడతాయి. ఈ గుడ్లు పడిపోకుండా ఒక రకమైన జిగురువంటి పదార్థంతో ఇవి అతుకుతాయి. పదార్థం నీరు తగలగానే గట్టిపడిపోతుంది. దీంతో గుడ్లను పొదిగేంతవరకూ కదలకుండా అలానే వుంటాయి. అనంతరం ఆడపురుగు వెళ్ళిపోతుంది. ఇక అంతా మగపురుగుదే బాధ్యత. ఇలా గుడ్లను వీపుపై వేసుకొని ఇష్టం లేకపోయినప్పటికీ ఈ క్రమం మాత్రం కొనసాగుతుంటుంది. ఎందుకంటే తమ వీపులపై వున్న గుడ్లను అవి కనీసం తాకను కూడా తాకలేవు. కాబట్టి పక్షం రోజుల పాటు గుడ్లు పిల్లలయ్యేంతవరకూ అలా వాటిని మోసుకుంటూ తిరుగుతుంటాయి.



పిల్లల్ని కనే నాన్న

చిన్నారి నేస్తాలూ! ముందుగా మీ అందరికీ ఒక విషయం చెప్పాలర్రా! అదేంటంటే... ఇవాళ 'ఫాదర్స్ డే'. అర్రే..అలా ఎగురుతూ చప్పట్లు చరచడంతోటే సరిపుచ్చుకోకుండా ముందు నాన్నకు శుభాకాంక్షలు చెప్పాలి. మరి మనకోసం అమ్మానాన్నలు ఎంత కష్టపడతారు! అందుకనే వారికోసం వేరువేరుగా ఒక్కోరోజును కేటాయించేశారు. అన్నట్టు ఈ సందర్భంగా మీకు సీ హార్స్ అనే బుల్లి ప్రాణి గురించి చెప్పాలి. అది సముద్రాల్లో వుంటుంది. తల చూస్తే గుర్రంలా వుంటుంది. అందుకే దానికి ఆ పేరు వచ్చింది. తోక కూడా వంపు తిరిగి తమాషాగా వుంటుంది. మగ సీ హార్స్ ప్రత్యేకత ఏంటంటే... ఇదే పిల్లల్ని కంటుంది. ఆశ్చర్యంగా వుందికదూ. కానీ నిజమేనర్రా. మగ సీ హార్స్ పొట్ట దగ్గర కంగారూకు మల్లే చిన్న సంచిలాంటిది వుంటుంది. అక్కడే ఒక చిన్న చీలిక వుంటుంది. ఆడ సీ హార్స్ గుడ్లను ఆ సంచిలోనే పెడుతుంది. ఎన్నో తెల్సా? సింపుల్‌గా 200 నుంచి 600 గుడ్లే. మగ సీ హార్స్ అప్పటినుంచి ఏదైనా గడ్డిపరకనో, మొక్కనో తన తోకతో చుట్టుకుని అలా వుండిపోతుంది. బయటకు కనిపించేలా ఈదడం వంటి పనులను బంద్ చేస్తుంది. శత్రువుల బారి నుంచి తనను, తన పిల్లలను కాపాడుకోవడానికి అది చాలా ఎత్తులు వేస్తుంది. తన చుట్టూ వున్న వాతావరణానికి అనుగుణంగా శరీరపు రంగును మార్చుకుంటుంది. గుడ్లను జాగ్రత్తగా కాపాడుకుంటూ పిల్లలను కంటుంది. ఇందుకు రెండు నుంచి ఆరు వారాల వరకు పడుతుంది. బుజ్జి సీ హార్స్ పొడవు ఎంతంటే... పావు నుంచి అర అంగుళం వరకు వుంటుంది. ఒక్కోసారి సంచిలోని పిల్లలన్నీ పుట్టేసరికి రెండు రోజులు పడుతుంది. చాలా మంచి నాన్న కదూ. పిల్లలు పుట్టకముందు నుంచే వాటిని ప్రాణప్రదంగా కాపాడడమంటే మాటలా! ఎంత ప్రేమ వుండాలి?! ఫాదర్స్ డే రోజున మీకు ఈ విషయాలన్నీ చెప్తోంది అందుకే.

-చూటీ

పొడుపు కథ విప్పతారా

1.ఎదురుగుండా ఉన్నంత సేపూ కనపడుతుంది. పక్కకు జరిగితే మాయమవుతుంది. ఏంటబ్బా అది?

2. ఎనిమిది కాళ్ళ ఎర్రయ్యకు తల లేదు. తోకా లేదు. ఎవరో వారు?

3. ఎర్రకోటు తొడుక్కున్న తెల్ల ముక్కదొర ఎంత సేపు నిలుచుంటే అంత పొట్టివాడౌతాడు. ఎవరై వుంటారు?



బ్రిడ్జి బావుందా!

నేస్తాలూ! ముందు మీరు ఈ పుస్తకాన్ని దూరంగా పెట్టుకొని చూడండి. ఏం కనిపించింది. ఏదో బ్రిడ్జి వున్నట్టుగా కదూ. మరైతే దగ్గరగా చూడండి ఎవరు కనిపించారు? కొంతమంది మనుషులే బ్రిడ్జిలా నిలబడ్డట్టు అగుపిస్తారు. ఇదే ఇవాల్టి చిత్ర విచిత్రం. దగ్గరగా పెడితే ఓ రకంగా దూరంగా పెడితే మరో రకంగా కనిపిస్తుంటాయి కొన్ని. అదే మరి దృష్టి చేసే తమాషా.

మొత్తం పప్పీలు ఎన్ని?

పిడుగులూ... చూశారుగా. ఇక్కడ కొన్ని కుక్కపిల్లలున్నాయి. అయితే అవి ఎన్నో చెప్పండి. ఆగండాగండి. తొందరేం లేదు. బాగా పరిశీలించాకే చెప్పండి సమాధానం.



బాలనేస్తాలు



ఇదేం జంతువు?

హాయ్ పిడుగులూ! మీ ముందుకు ఇవాళ ఓ తమాషా జంతువు వచ్చింది. చూశారుగా. ఇలాంటి జంతువును మీరు ఇప్పటి వరకు చూసే ఉండరు. మీరేంటి? మేమే చూడలేదు. మనమే కాదు. ఎవ్వరూ చూసి వుండరు. ఎందుకంటే దీన్ని 8 జంతువుల శరీరభాగాలతో గీశాడు ఆర్టిస్టు అంకుల్. ఇంతకీ ఆ ఎనిమిది జంతువులూ ఏవో చెప్పకోండి చూద్దాం.

రంగులు పులిమేద్దాం

పదాలు గుర్తించాలి గబగబా

Dad
Dada
Daddy
Falher
Gramps
Granddad
Granddad
Granddaddy
Grandfather
Grandpa

Pa
Papa
Parent
Parent
Pop

```
                S
              T R A
            A Y N M U
          A M D Q E L Z
        Q Y P D A V R B D
      R E H T A F D N A R G
    S J H N Y D P N D B P H O
    Z P T S R D T O Z N T E N
    B F M Q K N N K N X A L A
    O L O A E A W R U A J R A
    I R Y R R R M M L G R G G
    X I A G V G T S D Z G G S
    K P H T W L C B W Z G E V
      I O L Z G D W P C T I
        Z P W D L B Y K H
          T T Z D Z O F
            H D N Z U
              J M H
                U
```

నేస్తాలూ... ఇక్కడ 15 పదాలున్నాయి. అన్నీ నాన్నకు, కుటుంబానికి సంబంధించినవే. ఇవాళ ఫాదర్స్ డే కదా. అందుకని ముందుగా నాన్నకు శుభాకాంక్షలు చెప్పండి. తర్వాత పదిహేను పదాలను అక్షరాల్లో గుర్తించి సున్నా చుట్టండి. ఓకేనా!



గుడ్లమ్మ గుడ్లు...

చిన్నారులూ... మీకు కోడిగుడ్లంటే చాలా ఇష్టమంటగదా. మరైతే ఇక్కడ ఎన్ని గుడ్లున్నాయో లెక్కపెట్టి చెప్పండి. లెక్క తప్పిందో!

జవాబులు

ఇదేం జంతువు?
పులి, సింహం, జిరాఫీ, కంగారు, ఏనుగు, తిమింగలం, తాబేలు, దుప్పి

పొడుపు కథ విప్పతారా:
1. అద్దంలో బొమ్మ
2. ఎండ్రకాయ 3. కొవ్వొత్తి

మొత్తం పప్పీలు ఎన్ని?:
నాలుగు కుక్కపిల్లలు. కాకపోతే ఏ ఒక్కదానిదీ పూర్తి శరీరం కనిపించడంలేదు. తల కనిపిస్తే తోక వుండదు. వెనుక భాగం కనిపిస్తే ముందు భాగం కనిపించదు.

గుడ్లమ్మ గుడ్లు...:
ఏడు



సంగీతం - ఒక అద్భుతం! సృష్టిలో దాని స్థానం అద్వితీయం. మనుషులేం ఖర్మ? దేవతలు సైతం సంగీతాన్ని వదలలేకపోతుంటారు. ఒక్కోసారి వేణువు, ఒక్కోసారి డమరుకం సాయంతో సంగీత సాధన జరిగిపోతూ ఉండేది. అందువల్లే కాబోలు, చదువుల తల్లి 'సరస్వతీ దేవి'కి కూడా ఓ చేతిలో పుస్తకం వుంటే - మరో చేతిలో వీణ అలంకరించింది. సంగీతంలో కావాల్సిన వారికి శక్తి, రక్తి, భక్తి దొరుకుతుంది. విశ్వజనీనంగా మాట్లాడే శక్తి కేవలం 'సంగీతానికే వుందన్నది నిర్వివాదాంశం! సంగీతం మానవుల సర్వసామాన్య భాష! ప్రపంచంలో ఎలాంటి ఎల్లలూ లేకుండా స్వైర విహారం చేసేది సంగీతమే! నేడు ప్రపంచ సంగీత దినోత్సవం సందర్భంగా ఈ ప్రత్యేక వ్యాసం మీ కోసం...చిత్తగించండి మరి!

ఊయల ఊగినదోయి మనసు...

- డా|| జె.పి.వైద్య

రాతియుగం నుంచి కంప్యూటర్ యుగం దాకా సంగీతం స్వేచ్ఛగా రాజ్యమేలుతున్నది - అనే సత్యాన్ని గుర్తించాలి. పదండి. పాషాణయుగం లోకి తొంగి చూద్దాం తమాషాగా!

రాతి యుగంలో...

అసలు గుడ్డలూ, స్టైల్లూ, ఫ్యాషన్లూ లేని పాషాణయుగం. మనిషి డ్యూటీ 'వేట'. కడుపు నింపడం. రాయితో రాయి ఢీకొన్నప్పటి 'ఠక్... ఠక్' , రాయి నీటిలో పడ్డప్పటి 'బుడుంగ్', జంగల్‌లో మంగల్ చేసే సెలయేటి గలగలలు, చెట్ల ఆకుల గరగరలు, నీలాకాశంలో రివ్వున ఎగిరిపోయే పక్షుల కిలకిలా రావాలు, పాపాయి నోటి 'ఉంగ్వా((ఉంగ్వా((' ల తొలి రాగాల్లో సంగీతాన్ని గమనించారు. పాషాణ యుగంలోని మన పూర్వజులు.

క్రీ.పూ 5000-6000 వైదిక కాలంగా భావిస్తే - మన నాలుగు వేదాలను సకల కళల 'గంగోత్రి'గా భావించక తప్పదు.

వేదాలు అపౌరుషేయాలు. ముఖోద్గతం చేసి ఇంకొక తరానికి అందించబడ్డాయి.

వేదాల్లో 'రుచ'లు. సంగ్రహం సామవేదం. అన్నీ గేయ స్వరూపాలే!

మధ్యయుగంలో...

మధ్య యుగంలో (క్రీ.శ. 800 - 1800) రాగ సంగీతం మొగ్గలేసింది. ఆ తర్వాత సంగీతంలో 'ఖయాల్ గానం'... 'వాద్యగానం' ప్రజాదరణ పొందసాగాయి. ఖైబరు కనుమల నుండి జోరుగా మొగలాయీ దండయాత్రలు సాగాయి. వారి వెంట కత్తులూ, కఠార్లతో పాటు 'యుద్ధ పిపాస' ఏమాత్రం లేని అరబ్బీ, ఫారసీ, ఇరానీ సంగీతం కూడా వచ్చింది మనదేశంలోకి.

తన చుట్టూ ఎల్లల వలయాలు సృష్టించుకోలేని, సంగీతం మెల్లమెల్లగా ఇక్కడి సంగీతంతో మమేకమైంది.

'కవ్వాలి' అలా అక్కణ్ణించే వచ్చి నేడు సినిమా తెరమీదా, మన సమాజంలోనూ విడదీయలేని భాగమైపోయింది. నేటికీ 'ఉర్స్' ఉన్నచోట 'కవ్వాలి' ఉండాల్సిందే! సారంగీ, సరోద్ - చంగ్ షహనాయీ - బర్‌బత్ - రబాబ్ లూ అక్కడివే! హాయిగా ఇక్కడివైపోయి సన్నాయి నొక్కులు సాగిస్తూ నవ్వుకున్నాయి.

ముస్లిమ్ సంగీతం

ముస్లిమ్ సంగీతంలో ఆద్యుడు 'ఇబ్నే - ముసహ్ -హజ్'. ఇరాక్‌లోని 'అబ్బాసీ దర్బాల్'లోని అరబ్బీ, ఫారసీల సంగీతాన్ని కలుపుకుని 'ఇరానీ సంగీతం' రూపంలో ప్రపంచం నిండా వ్యాపించింది. ఇరానీ 'కవ్వాల్' సంగీతంలోని 'జంగులా' - 'జీఫ్' - 'షాహనా' - దర్బారీ' - 'జిలా' (ఖవజ్) మెల్లమెల్లగా మన సంగీతంలో కలిసిపోయాయి. 'అమీర్ ఖుస్రో' రెండు సంగీతాల మేళవాన్ని 'అందమైన సంగీత మిశ్రమం'లా తయారు చేశాడు. 'సితార్' నిర్మాణం ఆయనదే అని చెప్పుకుంటారు. ముస్లిమ్‌లది 'సూఫీ సాంప్రదాయ సంగీతం'. అంతా భక్తి సంగీతం అన్నమాట. మొహమ్మద్ తుగ్లక్‌ను మనం చరిత్ర చదివో చదవకో, 'పిచ్చి తుగ్లక్' అని స్టాంప్ అంటించి దులుపుకున్నాం. కానీ, ఆయన దర్బార్ లోనూ సంగీతం పొంగి పొర్లింది. ఆ

'తుగ్లక్'గారి దర్బారులో అలనాటి గొప్ప గాయకుడు 'అమీర్ షమ్స్ ఉద్దీన్ తబ్రేజీ' ఉండేవాడు. అలానాటి 'దేవ్‌గఢ్' (నేటి 'ఔరంగాబాద్' సమీపానున్న 'దౌలతాబాద్' కోట) దగ్గర 'తరబాబాద్'అనే 'చౌపట్ బజార్' ఉండేది. పగలు మూడు గంటల్నుంచి తెల్లారే దాకా అక్కడ 'అరబీ – ఇరానీ – హిందూస్థానీ' సంగీతం ప్రముఖంగా ఉత్తర భారత దేశాలలో జోరందుకుంది. అలనాటి మధుర, అయోధ్య, బనారస్, లక్నో ప్రముఖమైన 'సంగీత క్షేత్రాలు'. షాజహాన్ కాలంలో సంగీతం మీద 'షమ్స్ – ఉల్ – అస్వాత్' అనే మొదటి గంథ్రం రాశారట. రెండో అక్బర్ కాలంలో 'మీర్జాఖాన్', సంస్కృత పండితుల సాయంతో 'తుహఫా – తుల్ – హింద్' అనే గొప్ప గ్రంథం రచించాడు. అందులో జ్యోతిష్యం, సాముద్రికం, కోక్‌శాస్త్రం, నాయికా భేదం, ఇంద్రజాలం వంటి విషయాలతో పాటు అలనాటి సంగీతం ముచ్చట్లున్నాయి.

భారతీయ సంగీతం

భారతీయ సంగీత శాస్త్రం గురించి ఫారసీలో నవాబ్ 'ఆసఫ్ – ఉద్దౌలా' శాసనకాలంలో రాసిన 'ఉసూల్ – ఉల్ – నగమాత్ – ఉల్ – ఆసిఫియా' గొప్ప గ్రంథం. ఇప్పుడు ఒకటో – రెండో ప్రతులు, అవీ ఏ మ్యూజియంలోనో ఉండొచ్చు. 'వాజిద్ అలీషాహ్' జమానా వచ్చే సరికి లఖ్నోలో "కదర్‌పియా" రచించిన 'ఠుమ్రీ'లు గల్లీ గల్లీలోని 'ఆమ్ ఆద్మీ' కోసం పసందుగా నిలిచిపోయాయి. ధ్రుపద్ – హోరీల కన్నా ఖమాజ్ – ఝింఝోటీ – భైరవీ – సునిద్రా – తిలక్ – కామోద్ – పీలూ లాంటి రాగాల స్వరాలు పాపులర్ అయిపోయాయి. సర్వసామాన్యులు కూడా 'ఠుమ్రీ'లు గున్‌గానాయించేవారు.

ఆ కాలంలో హిందూస్థానీ రాగ రాగినీలు, ముఖ్యంగా భైరవీ రాగం అక్షరాలా లఖ్నో 'తెల్ల ఖర్బూజా'లంత జనరంజకాలు. ఎంతో ప్రజాదరణ పొందాయి. పెళ్లిళ్ల సీజన్ వచ్చిందంటే చాలు 'జులూస్' (ఊరేగింపు)లో 'ఢోల్ –తాషా', 'రౌషన్ చౌకీ', – 'నౌబత్' – 'తురహీ – కర్నా(శంఖం)' – 'ఢంకా–బిగుల్' – 'అంగ్రేజ్ ఆర్గన్' ఉండాల్సినవే. అలా, అలనాడు సంగీతం మామూలు మనిషి ఇంట్లో, ఒంట్లో సుతారంగా ఒదిగిపోయింది. అక్బర్ పాదుషా కాలంలో సంగీతం మూడు పువ్వులు– ఆరు కాయల్లా వెలిగిపోయింది. కొన్ని వెలుగులు 'రాగ్ – దీప్' తాలూకు మహనీయుడైన 'సంగీత్ సామ్రాట్ తాన్‌సేన్'వి. మనం కూడా మరిచిపోలేదు (చాలామంది రసికులకు 'బైజుబావరా' జ్ఞాపకం వుండొచ్చు ఇంకా). ఎటొచ్చీ – ఔరంగజేబు చూపుల్లో, మనసుల్లో సంగీతం లాంటి రమ్యతలు అంతగా పొసగలేదు. ఆయనకు నచ్చిందల్లా ఒక్కటే. గెలిచిన చోటల్లా 'నౌబత్'లను జోరుగా వాయించడం. మన హైదరాబాద్ 'నౌబత్ పహాడ్'మీది సంగీతం అలనాటి 'నగరాల మోతే'!

ఆధునిక సంగీతం

చూస్తూ చూస్తూ ఆధునిక కాలం వచ్చేసింది. వాద్యసంగీతం, లలిత సంగీతం కూడా మామూలు మనుషుల గుండెలకు చేరువైపోయాయి.

భరతుడి 'నాట్యశాస్త్రం', జయదేవుడి 'గీతాగోవిందం'ల చోటే ఠుమ్రీ, గజల్, అభంగ్, భజన గీతాలు పాపులర్ అయిపోయాయి.

ఆత్మ పల్లవించే పడవలా, వెచ్చని పాటలతో, వెండి అలలపై నిద్రిస్తున్న రాజహంసలా అలనాటి సినిమా సంగీతం – ఆ తర్వాత నేటి రణగొణ ధ్వనులతో నిండిన, గల్లీ గల్లీలో సునామీలా దద్దరిల్లే లొల్లి సంగీతం వచ్చింది.

షహ్నాయి, సంతూర్, వేణువు, వయోలిన్, సితార్ ల అద్భుత లయలతో పాటు సింఫొనీ, సొనటా, కన్సర్ట్, క్వార్టెట్, ర్యాంప్, బీటల్స్ కూడా వచ్చాయి.

మన యువతీ యువకులు జానా బెత్తెడు గుడ్డలేసుకుని పిచ్చెక్కినట్టు చిందులేశారు. ఎంతసేపని ఎగురుతారు? చిందులేస్తారు? అలసీసొలసీ, సంగీతం గురించైనా ఆలోచిస్తున్నారా? సంగీతం ఒక మహత్తర ప్రవాహం. అది ఒక మహా తరంగం. ప్రతి మదిని దోచే మనోహర తరంగం.

శాస్త్రీయ సంగీతం గురించి ఏమాత్రం అవగాహన లేకున్నా సంగీతం అంటే అంతో ఇంతో తెలుసుకోవాలనే కుతూహలం ఉన్న పాఠకులకు ఇక్కడ సవినయంగా చిన్న మనవి.

సంగీతాన్ని ఆస్వాదించడానికి 'స–రి–గ–మ'ల ప్రవేశం, సంగీత జ్ఞానం ఏమాత్రం అవసరం లేదు. 'తామెచ్చింది రంభ' అన్నట్లు 'మనసుకు నచ్చిందే సంగీతం'. దట్స్ ఆల్!!

శాస్త్రీయ సంగీతం

శాస్త్రీయ సంగీతం – నానా విధ పుష్ప ఫల జాతుల అందమైన చిక్కటడవి అనుకుంటే లలిత సంగీతం పరిమళాల పూల మొక్కలున్న చిరు ఉద్యానవనం.

శాస్త్రీయ సంగీతం ఇంతెత్తు అలల మహాసముద్రం. లలిత సంగీతం మనసైన గుండెల కోసం పలకరించే 'తామర కొలను'.

శాస్త్రీయ సంగీతంలో 'రాగం' విస్తృతంగా, సంపూర్ణంగా దర్శనమిస్తుంది. లలిత సంగీతంలో రాగంలోని ఒక భాగం సొగసైన భంగిమతో శ్రావ్యమైన నాద లహరులను సృష్టిస్తుంది. అన్నింటిలోనూ ఉంది 'శ్రుతి' – 'లయ'!!

మన దేశంలో దాదాపు ఉత్తరాదిలో వ్యాపించి ఉన్నది 'హిందూస్తానీ సంగీతం' దక్షిణాదిలో ఉన్న సంగీతం. అందాలన్నీ 'కర్ణాటక సంగీతం బాపతే.

భరతుని 'నాట్యశాస్త్రం'లో 28 నుండి 33 వరకున్న ఆరు అధ్యాయాల్లో కేవలం సంగీతం చర్చే! 28వ అధ్యాయంలో వాద్యాల ముచ్చట్లున్నాయి.

'నగ్మాతే ఆసిఫీ' – 'రయీస్ మొహమ్మద్ రజా' రాసిన సంగీత పాఠ్యగ్రంథం. పండిట్ విష్ణుశర్మ, పండిట్ భాత్‌ఖండే, సంగీత మహాపండితుడు షోరంగదేవ్ రాసిన 'సంగీత రత్నాకర్, పండిట్ లోచన్ విరచితమైన రాగతరంగిణి, పండిట్ శ్రీనివాస్, విష్ణుదిగంబర్ పలుస్కర్ లాంటి మహనీయుల వల్ల మన సంగీత సీమ ఎంతో విస్తరించింది.

72 థాట్‌లోని ఉత్తరాది 'హిందుస్తానీ సంగీతం'తో దాదాపు 10 దక్షిణాది రాగాలు సామ్యం కలిగి ఉన్నాయి.





కర్నాటక సంగీతం

వినిపించే గానం మధురంగా ఉంటే వినిపించనిది మధురాతి మధురంగా ఉంటుందట. సృజనాత్మకమైన కళాసృష్టికీ, స్థితీ లయలకూ మూలం, ప్రేరణ కేవలం భగవంతుడే అని భావిస్తూ రూపం తీసుకున్న గొప్ప సంగీత సంప్రదాయం 'కర్నాటక సంగీతం'. అది చాలా కాలం దేవాలయ ప్రాంగణాలనూ, రాజాశ్రయం పొందిన రాజ ప్రాసాదాలను వదిలి బయటకు రాలేదు. సినీ పితామహ పురందరదాసు, నిజగుణ శివయోగి, పుండలీక విఠలుడి వంటివారు ఆదికాలపు సంగీత మహారథులు. ప్రముఖ వాగ్గేయకారుల్లో మైసూరు వాసుదేవాచార్య, సదాశివ, వీణే శేషన్న, జయరామ రాజేంద్ర వడియార్‌లను పేర్కొంటారు. కదంబ, హోయ సల, చాళుక్యులతో పాటు విజయనగర సామ్రాజ్యం, వొడియర్ల జమానాలో కర్ణాటక సంగీతం ఎంతో ఎదిగింది. 'సంగీతం అంటే నాదం, స్వరం, రాగంల మిశ్రమం' అంటూ సంగీత త్రిమూర్తులు త్యాగరాజస్వామి, ముత్తుస్వామి దీక్షితులు, శ్యామశాస్త్రి లాంటివాళ్లు కర్ణాటక సంగీతాన్ని మహోన్నత స్థాయికి తీసుకెళ్లారు. అది నిజంగా కర్ణాటక సంగీతానికి స్వర్ణయుగం లాంటిది. ఛాయా మాత్రమైన శృతి అంతరాలతో జటిలమైన గమక ప్రయోగాలతో, ఒక్కొక్క రాగం గంటల తరబడి పాడగలిగే అసాధారణమైన ప్రతిభతో, క్లిష్ట లయ విన్యాసాలతో సంగీత సాధన సాగేది. తొమ్మిది రోజులు తోడి రాగాన్ని పాడిన తోడి సీతారామయ్య, శంకరాభరణ రాగం స్పెషలిస్టు 'నరసయ్య', బేగడ సుబ్రహ్మణ్య అయ్యర్, నారాయణ గౌళ కుప్పయ్యర్ ఆరాణా ఆది అప్పయ్యల లాంటి వారిని విని ఆనందించే ఘనాఘనులు ఉండబట్టే 'అదంతా స్వర్ణయుగం' అయిందేమో! నేటికీ గురుకులాలున్నాయి. శాస్త్రీయ సంగీతంలో విద్వాన్ బళ్లారి వెంకటేషాచార్, విదూషి మహాలక్ష్మి, పుష్పాశ్రీనివాసన్, డా॥సుకన్యా ప్రభాకర్, కమల, రాజ్యలక్ష్మి వారు సంగీత సేవ చేస్తుంటే మరోవైపు వాద్య సంగీతంలో విద్వాన్ హెచ్.కె. నర్సింహామూర్తి (వయోలిన్), ఎమ్.కె. సరస్వతి(వీణ), ఎ.కె. ప్రకాష్(వేణువు), రామానుజం(మృదంగం), రమేష్(ఘటం) కర్ణాటక సంగీతం పరిమళాలను నలువైపులా వెదజల్లుతున్నారు. అన్నట్టు ఘటం, మృదంగం వాద్యాలు దక్షిణాది సంగీతంలో 'ఖాసియత్'లు!

బిలావత్ (శ్రీ శంకరాభరణం), కల్యాణ్ (మేచ్ కల్యాణి), ఖమాజ్(హరికాంభోజి), కాఫీ (ఖరహరప్రియ), ఆసావరీ(నటభైరవి), భైరవి (హనుమత్తోడి), భైరవ్(మాయామాలవ్ గౌళ), పూర్వీ (కామవర్ధిని), మార్వా (గమనప్రియ), తోడి (శుభపంతువరాలి)... ఇవి కొన్ని సామ్యం ఉన్న రాగాలు! మనం మామూలు మనుషులం!

పక్క వాటాలోంచి మంచి సంగీతమో, పాటో విన్పిస్తే సిటీ బస్ మిస్సయినా తట్టుకుని విని పరవశం చెందే పిచ్చోళ్లం!

మనకు 'ఆరోహణ' – 'అవరోహణ' – 'అస్తాయి' – 'అంతరా' – నోమ్‌తోమ్'తో 'క్యా లేనా దేనా'? మన పని చెవులకింపైన మధుర సంగీతాన్ని వినటం... గున్‌గునాయించడం...! ప్రతి రాగానికి ప్రత్యేక సమయం అంటూ ఉంది. రాగాలు ప్రత్యేకమైన మానసిక ప్రవృత్తులకు నిదర్శనాలు. భైరవి సభ ఆఖర్న పాడే రాగం. రౌద్ర రసరాగం , భూపాల్ శృంగార రసానికి, వసంత్ హాస్య రసానికి, మాళవరాగం భయానక రసానికి అని స్వరూప వర్ణనలున్నాయి. సినీ సంగీతం వల్ల రాగాలు ముక్కలై మరో మనోహర రూపం దాల్చాయి. సినీ సంగీతం దునియా పూర్తిగా విచిత్రమైంది. హిందీ సినీ సంగీతం దునియాలోని ఎవర్‌గ్రీన్ మెలోడీ మేకర్స్ శంకర్ – జై కిషన్‌లు భైరవీ రాగంలో అందించిన గీతాలు నాడూ – నేడూ ఎవర్ గ్రీన్ రొమాంటిక్స్. ఎన్ని సార్లు విన్నా తనివి తీరదు కదా? ఉదాహరణకు చోరీచోరీ, శ్రీ 420, అనాడీ, సన్యాసీ గీతాలు వినండి. ఎక్కడుందీ రౌద్రం? హిందుస్తానీ సంగీతంలో నాలుగు ప్రముఖ ఘరానాలున్నాయి.



1.గ్వాలియర్ ఘరానా : మూల పురుషుడు నథన్ పీర్ బక్ష్, హస్సూఖాన్, హద్దూఖాన్‌లు ఆయన మనుషులు. మహారాష్ట్రలో ఖ్యాల్ గాయకీ ప్రత్యేకతను చాటి చెప్పిన కీ.శే. బాలకృష్ణరువా ఇచల్ కరంజీకర్, పలుస్కర్, ఎం.ఓంకార్‌నాథ్ ఠాకూర్, వినాయక్ రావ్ పటవర్ధన్, నారాయణరావ్ వ్యాస్, కుమార్ గంధర్వ్ అగ్రగణ్యులు. శుద్ధరాగం – సరళమైన గాన పద్ధతి వీరి ప్రత్యేకత.

2. కిరాణా ఘరానా : ఆద్యులెవరూ? అనే ప్రశ్నకన్న సాక్షాత్తు శ్రీకృష్ణుడి వేణువు మా కంఠంలో రూపుదిద్దుకునేలా 'న భూతో న భవిష్యత్'గా అద్భుత గాన కోవిదుడు ఖాం సాహెబ్ అబ్దుల్ కరీం ఖాన్ గారిని తలచుకోవడం ముఖ్యం. వారి శిష్యులే రామ్ భావుకుంద్ గోళ్‌కర్(సవాయీ గంధర్వ్), సురేష్ బాబూ మానే, రోషనారాబేగం, హిరాబాయి బడోదేకర్, గంగూబాయి హంగల్, ప్రభా అత్రే! భారత్ రత్న పండిట్ భీమ్‌సేన్ జోషి గారి గురించి ప్రత్యేకంగా ఏం చెప్పాలి? టీవీ చేసే ప్రతి పాలుకారే బుగ్గల పసివాడు కూడా చెప్తాడు 'మిలే సుర్ మేరా తుమ్హారా' ముచ్చట! రసికులు ఆయన భక్తిగీతాలు విని ఇంకా ఆనందించవచ్చు.

3. జయపూర్ ఘరానా : మూల పురుషుడు 'మన్‌రంగ్' అని పేర్కొంటారు. ఆ ఘరానా మరోపేరు 'అత్రోలీ ఘరానా'! ఇందులోంచే

పాటియాలా ఘరానా పుట్టుకొచ్చింది. ఈ తరంలో జైపూర్ ఘరానా రెపరెపలు "కిషోరీ శివోణ్కర్" గాత్రం ద్వారా నలుదిశలా వ్యాపించింది. సురశ్రీ కేసర్ బాయి కేర్కర్, మోగూబాయి కుర్డీకర్, పండిత్ మల్లికార్జున్ మన్సూర్ చాలా ప్రముఖమైన గాయకులుగా సుపరిచితులే.

4. ఆగ్రా ఘరానా : సంగీత్ సామ్రాట్ తాన్‌సేన్ అల్లుడైన 'హజీ సుజాన్' తర్వాత విపరీతమైన పేరు ప్రఖ్యాతులు స్వంతం చేసుకున్నారు. బడోదా కు చెందిన విశ్వ విఖ్యాత గాయకుడు ఉస్తాద్ ఫైయ్యాజ్ ఖాన్ గారు. ఈ మధ్యకాలంలో దిన్‌కర్ కాయకిణి, లలితా రావ్, బబన్ రావ్ హాళదణ్ కర్ ఆగ్రా ఘరానా జండాను రెపరెప లాడిస్తున్నారు.

మనలో చాలా మందికి తెలియకపోవచ్చు. మన గానకోకిల లతా మంగేష్కర్ తండ్రి స్వర్గీయ దినానాథ్ మంగేష్కర్ గొప్ప పేరున్న శాస్త్రీయ గాయకుడు. సంగీత నాటకాల్లో అగ్రగణ్యుడు(ఆశా భోంస్లే 'శురా మీ వందిలే' వీలు చూసుకుని ఒక్క సారైనా వినండి). మహారాష్ట్రలో నాట్య సంగీత్ - భావ్‌గీత్ - లావణీ - పొవాడా లాంటి చాలా ప్రజాదరణ పొందాయి.

సంగీత నాటకాల్లోని గీతాలు బింబాధరా మధురా (శారదా), 'కరిణ్ కరిణ్ కరిణ్ కతీ'(భావబంధన్), మృగనయనా రసిక మోహినీ(సంశయ్ కల్లోళ్) నరవర్ కృష్ణా సమాన్ (స్వయంవర్), ఉగవలా చంద్రపునవేచా(పాణిగ్రహణ్) నేటికీ గున్‌గునాయించే మహా కవులు పూణే గల్లీ గల్లీలో కన్పిస్తారు.

రశిక శ్రోతలకు, పాఠకులకూ ముందే విన్నవించుకుంటున్నాను. భారతీయ శాస్త్రీయ సంగీతం మహా సముద్రం. ఏవో కొన్ని రాగాలు గీతాలు గున్‌గునాయించే మా బోటి మామూలు మనుషులం ఏం రాస్తాం? ఎంత రాసినా తక్కువే!

విశ్వజనీనం...

సంగీతం విశ్వజనీనమైంది కదా! అటుకేసికూడా తొంగి చూద్దాం. ప్రాచీన గ్రీసు వాళ్ళు సంగీత ప్రియులు. చట్టాలు గిట్టాలు జాన్తానై... ఈ దేశానికి కావాల్సిన పాటలు నేనే తయారు చేస్తానంది బాబూ అనే మాట చిన్నా చితకలు అనలేదు. సాక్షాత్తూ ప్లాటో అన్నాడా మాట.

చైనా గీతాల్లో ఎ పిక్చర్ ఆఫ్ వైయొలెంట్ ఎగొనీ ఉందంటారు. జపాన్ గీతాల్లో చింగ్ చింగ్... టింగ్ టుంగ్ అంటూ అదపాదడపా తోవ తప్పిన గోల మనసుకు రేడియోలో గమ్మత్తు సంగీతం విన్పిస్తుంది. అవి రుతువుల సంగీతధారలు...!

సెకనుకు 240 కంపనాలున్నది షడ్జస్వరం. ఇంగ్లీష్ సంగీతం మన

బుర్రకు అంతగా ఎక్కిచావదు. నేను విన్నది, నాకు కాస్తో కూస్తో పరిచయం ఉన్నవారి సంగతి చెప్తాను. లుడ్విగ్ వాన్ బిథోవిన్, హెక్టర్ బెర్లియోజ్, ఫ్రాంజ్, మొజార్ట్ (పూర్తిపేరు వుల్ఫ్ గాంగ్ అమాడియస్ మొజార్ట్), వాగ్నర్, చైకొవస్కీ, గుస్తావ్.... ఇక బీటల్స్ సంగతి తెలియనిదెవరికని? ఈనాటి యువత కోసం మిగతా రాతలు వదిలేస్తాను! ఈ తరం ఇష్టం! ప్రపంచం సంగీతం ముచ్చట్లలో రవీంద్ర సంగీతాన్ని కూడా మరచిపోకూడదు.

'ఎకలా చలోరే...' నుంచి పాదో ప్రాంత రాఖోసేబోకే, శాంతి సదన సాధన ధన దేబో దే బోహె లాంటి చర్చిలోని కోయిర్ గీతం దాకా రవీంద్ర సంగీతం రంజింప చేసింది. ప్రపంచ సంగీతంలో ఒక్క తంజావూరు ఆస్థానంలోనే 300 పైగా సంగీత విద్వాంసులు కొలువు తీరిన కర్ణాటక సంగీతం ప్రత్యేకత దానిదే! సంగీత త్రిమూర్తులు త్యాగరాయ స్వామి - ముత్తుస్వామి దీక్షితులు - శ్యామశాస్త్రి లాంటి వారు మహోన్నతులు. ఇటీవల అన్నమయ్య లక్షగొంతుల గీతాల వాణి ప్రపంచంలో మనకో ప్రత్యేక స్థానాన్ని సంపాదించి పెట్టింది.

సమయం. పేజీల ఇబ్బంది వల్ల రాతను సంక్షిప్తీకరించక తప్పదు. కానీ, తెలుగు లలిత సంగీత వికాసం - తెలుగు, హిందీ సినీ సంగీతం గురించి ముచ్చటించక పోతే ఎలా? నేడు మన ఊపిరే అది కదా! శ్రీశ్రీ మరో ప్రపంచం - కృష్ణశాస్త్రి - రాయప్రోలు - ఎంకి పాటల నండూరి - శివశంకర శాస్త్రి - చింతా దీక్షితులు - అడవి బాపిరాజు - విశ్వనాథుల వారు... సముద్రాల దగ్గర్నించి సినారే, దాశరథి, వేటూరి, తేజా దాకా... సంగీతం లలితంగా వయ్యారంగా సాగింది.

అది మైలవరం వారి సావిత్రి నాటకంలో 'హా బాల పొమ్మికన్' కావచ్చు. వరలక్ష్మి నుండి జానకి, సుశీల, చిత్ర దాకా.... ఘంటసాల నుండి బాలు దాకా... సైగల్, రఫీ, ముఖేష్, కిషోర్, మన్నాడే, తలత్‌ల నుండి సోనూ దాకా... లతా నుండి శ్రేయా దాకా గాత్ర సంగీతం మనలను అలరిస్తూనే ఉంది. దాదాపుగా సినీ సంగీతం అన్నింటినీ డామినేట్ చేసింది.

అమ్మబాబోయ్! వాద్య సంగీతం గురించి రాయనేలేదు... అని నడివీధిలో వీపు మీద ఏ రాగం వాయిస్తేనేంలెండి.. శాస్త్రీయ సరిగమలు తెలియకున్నా బాత్‌రూం సింగర్లు హాయిగా తడితడిగా 'చిటపట చినుకులో'.... 'చిగురాకులలో చిలకమ్మా' పాడుకోవడం లేదా? బాత్‌రూంలు కూడా లేని గరీబోళ్లు కూడా జోష్‌తో 'కజరారే' అని గున్‌గునాయించడంలేదా?

దటీజ్... ది బ్యూటీ ఆఫ్ మ్యూజిక్! 'సరిగమలు' వస్తే ఏం? రాకపోతే ఏంటటా? కూనిరాగాలనాపటం ఎవరితరం?

★

ఆరోగ్యం

బ్యాక్టీరియా, ఫంగై, వైరస్‌ల వల్ల సూక్ష్మక్రిములు శరీరంలోకి ప్రవేశించే అవకాశం ఉంటుంది. ఫంగస్ ఇన్‌ఫెక్షన్లు మునుపటి కంటే ఈ మధ్య ఎక్కువగా వస్తున్నాయి. అసలు ఇవి ఎందుకొస్తాయి? కారణాలేంటి? లక్షణాలేంటి? చికిత్స వంటి వివరాలు ఈవారం తెలుసుకుందాం.

వర్షాకాలంలో చెవి ఇన్‌ఫెక్షన్

చాలా శక్తివంతమైన ఎన్నో రకాల 'బ్రాడ్‌స్పెక్ట్రమ్' యాంటీ బయాటిక్స్ విపరీతంగా వాడటం, సుగర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య అధికమవడం దీనికి కారణం. ఈ రెండింటి వల్ల ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు ఎక్కువగా సోకడానికి అవకాశం ఉంది.

చర్మానికి, శరీరంలోని ఇతర అవయవాలకు ఫంగస్ వల్ల ఇన్‌ఫెక్షన్లు సోకే విధంగానే చెవిలో కూడా ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు సోకవచ్చు. దీన్నే 'ఓటో మైకోసిస్' అంటాం. చెవి మూడు భాగాలుగా ఉంటుంది. బయట చెవి, మధ్య చెవి, లోపలి చెవి, బయట చెవి కర్ణభేరి వరకూ ఉంటుంది. కర్ణభేరి నుండి లోపల ఎముక వరకూ వుండే గాలి గదిని 'మధ్య చెవి' అంటారు. ఎముక లోపల వుండేది 'లోపలి చెవి'. అందులో శబ్దాన్ని రిసీవ్ చేసుకునే స్టేషన్ (కాక్లియ), వెస్టిబ్యూల్ ఉంటాయి.

బయట చెవికి ఫంగల్ ఇన్‌ఫెక్షన్ రావడం సర్వసాధారణం. ఎక్కడైతే వేడి, తేమ ఎక్కువగా ఉంటాయో అక్కడ ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు వస్తాయి. ఒకసారి ఫంగల్ ఇన్‌ఫెక్షన్ సోకితే దాన్ని నయం చేయడం కొంచెం కష్టం. చెవిలో ఆ ప్రాంతాన్ని తేమ లేకుండా శుభ్రపరిచి యాంటీ ఫంగల్ డ్రాప్స్ రెగ్యులర్‌గా వేస్తూ ఉంటే క్రమంగా ఇది నయమవుతుంది.

ఫంగస్ రకాలు

'ఓటో మైకోసిస్'ను కలుగజేసే ఫంగస్‌లు అనేక రకాలున్నాయి. కొన్ని నల్లగా, బొగ్గులాగా ఉంటాయి. కొన్ని తెల్లగా దూదిలాగా ఉంటాయి. ఇవి మెత్తగా, తడిగా ఉంటాయి. మైక్రోస్కోప్‌లో 10 శాతం పొటాషియం హైడ్రాక్సైడ్‌తో కలిపి చూస్తే వీటిని గుర్తించొచ్చు. వీటిని కల్చర్ చేసి ఏ రకం ఫంగస్ అనేది కూడా కనుక్కోవచ్చు. దాన్ని బట్టి యాంటి ఫంగల్ డ్రగ్ సెలెక్ట్ చేయవచ్చు.

కారణాలివి...

చెవిలో చీము కారే వాళ్లలో తేమ ఎక్కువగా ఉండడం వల్ల ఫంగస్ ఎక్కువగా వస్తుంది. నూనెల్లో ఫంగస్‌లు ఉంటాయి. గుబిలి కారడానికి చాలా మంది చెవిలో నూనె వేస్తుంటారు. నూనె బాగా కాచి, చల్లార్చి వేయకపోతే నూనె వేసిన నాలుగైదు రోజుల్లో ఓటోమైకోసిస్ వస్తుంది.

చెవి చుట్టుపక్కల ఎక్కడైనా ఫంగల్ ఇన్‌ఫెక్షన్ వుంటే అది చెవిలోకి వ్యాపించే అవకాశం ఉంటుంది. మామూలుగా వర్షాకాలంలో 'ఓటోమైకోసిస్' ఎక్కువగా వస్తుంటుంది. అంతకుముందు వర్షాకాలంలో ఓటోమైకోసిస్ వచ్చి తగ్గి వుంటే తడిచేరినప్పుడు ఆ ఫంగస్ తాలూకు స్పోర్స్ మళ్లీ పెరిగే అవకాశం ఉంది.

మధుమేహ వ్యాధి (సుగర్) ఉన్న వారిలో ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు ఎక్కువగా వస్తాయి. ఎయిడ్స్ పేషెంట్లలో వ్యాధి నిరోధక శక్తి లోపించడం వల్ల ఫంగస్ వస్తుంది. కొన్ని ఆరోగ్యకరమైన బ్యాక్టీరియాలు ఫంగస్ రాకుండా నిరోధిస్తాయి. వ్యాధి నిరోధక శక్తి తగ్గినపుడు ఇవి కూడా తగ్గిపోయి ఫంగస్ రావడానికి దారితీస్తాయి. యాంటీ బయాటిక్స్ గానీ, స్టిరాయిడ్స్ డ్రాప్స్‌గానీ అధికంగా వాడితే ఫంగస్ వచ్చే అవకాశాలు ఎక్కువ. వేసవి కాలంలో కంటే వర్షాకాలంలో ఫంగస్ ఎక్కువగా వస్తుంది.

వ్యాధి లక్షణాలు

'ఓటోమైకోసిస్' చాలా సాధారణంగా వచ్చే వ్యాధి. దీన్ని చాలా సులభంగా గుర్తించవచ్చు. ఈ వ్యాధి సోకినప్పుడు చెవి దురదగా వుంటుంది. ఏదైనా పుల్ల పెట్టి గెలికితే దురదతో పాటు నొప్పి మొదలవుతుంది. నీరు గానీ, రక్తంగానీ, నల్లగా లేక తెల్లగా మెత్తగా ఉండే పదార్థాలుగానీ చెవిలోంచి వస్తాయి. తీస్తున్నకొద్దీ మళ్లీ తయారవుతూనే ఉంటాయి.

సమస్యలు

అశ్రద్ధ చేస్తే చెవి పొరకు రంధ్రం పడి చీము కారే ప్రమాదం ఉంటుంది. ఇయర్ బడ్స్ పెట్టడం వల్ల ఉపయోగం కంటే హాని ఎక్కువ జరిగే అవకాశం ఉంది. సొంత వైద్యంగా యాంటీ బయాటిక్ డ్రాప్స్ మెడికల్ షాపుల్లో తెచ్చుకుని కొందరు వాడుతుంటారు. దీనివల్ల వ్యాధి తగ్గకపోగా ఎక్కువయ్యే ప్రమాదం ఉంది. యాంటీ ఫంగల్ డ్రాప్స్ వాడినా శుభ్రంగా సక్షన్‌తో డ్రైగా చేయనిదే వ్యాధి నయం కాదు.

డాక్టర్ బి.సుస్మిత
ఇన్‌ఎన్‌టి వైద్యనిపుణులు
ప్రైమ్ హాస్పిటల్స్,
హైదరాబాద్
9848536124

చికిత్స

చెవిని సక్షన్ క్లీనింగ్ ద్వారా పరిశుభ్రంగా, తేమ లేకుండా డ్రైగా చేయాలి. చికిత్సలో ఇది చాలా ముఖ్యం. సరిగా శుభ్రపరచకుండా యాంటీ ఫంగల్ డ్రాప్స్ వేస్తే ఉపయోగం వుండదు. రెండు రోజులకోసారి సక్షన్ క్లీనింగ్ రెండు మూడు పర్యాయాలు చేయడం మంచిది. క్లీనింగ్ తర్వాత యాంటీ ఫంగల్ డ్రాప్స్ రోజుకు రెండు మూడుసార్లు వేయాలి. స్పిరిట్‌తో చెవిని శుభ్రపరచడం కూడా చాలా మంచిది. చెవికి నీరు తగలకుండా డ్రైగా వుంచడం చికిత్స అయిన తర్వాత కూడా కొద్ది రోజులుగా పాటించాలి.

అవసరమైతే యాంటీ ఫంగల్ టాబ్లెట్స్ కూడా వాడొచ్చు. కానీ తరచూ వాడాల్సిన అవసరం లేదు. క్లీనింగ్ చేయడం, ఇయర్ డ్రాప్స్‌తోనే చాలా వరకూ వ్యాధి తగ్గిపోతుంది.

యాంటీ ఫంగల్ డ్రాప్స్‌తో పాటు యాంటీ బయాటిక్స్, యాంటీ ఎలర్జీ మందులు కూడా వాడాలి. చెవిలో నీళ్లు చేరకుండా డ్రైగా వుంచుకోవడం, చెవిలో నూనె వేసుకోకపోవడం లాంటి జాగ్రత్తలు పాటించాలి. ★

బెండకాయ కూటు

కావలసినవి

బెండకాయలు - 1/2 కిలో, శనగలు - 1 కప్పు
కొబ్బరి కోరు - 1 చిప్ప, పచ్చిమిర్చి - పది
నూనె - అరకిలో, కరివేపాకు - తగినంత
మజ్జిగ- 2 కప్పులు, చింతపండు - 100 గ్రా॥
తాలింపు గింజలు - సరిపడినన్ని
శనగపప్పు - 2 స్పూన్లు, మినపప్పు - 2 స్పూన్లు
ధనియాలు - 2 స్పూన్లు, పసుపు - కొద్దిగా
ఉప్పు, కారం - సరిపడా

తయారుచేసే పద్ధతి

చింతపండు నానబెట్టి చిక్కటి పులుసు తీసుకోవాలి. శనగలు నానబోసుకోవాలి. మజ్జిగలో బెండకాయ ముక్కలు వేసి ఉడికించాలి. రెండు చెంచాల నూనెలో ధనియాలు, శనగపప్పు, మినపప్పు, మిర్చి, కొబ్బరి, ఉప్పు కలిపి మిక్సీలో వేసి మెత్తగా చేసుకోవాలి. శనగలు, ఉప్పు వేసి ఉడికించుకోవాలి. చింతపండు పులుసులో... ఉడికించిన బెండకాయలు, కొబ్బరిముద్ద, ఉడికించిన శనగలు, కొంచెం పసుపు, ఉప్పు, కారం వేసి ఉడికించాలి. చివరగా కళాయిలో నూనె వేసి పోపు పెట్టి కూటులో కలుపుకోవాలి.



పెసరపప్పు కూటు

కావలసినవి

పెసరపప్పు - 300 గ్రా॥, పెద్ద బంగాళదుంపలు - ఆరు
కొబ్బరి తురుము - 2 చెక్కలు,
పసుపు - 2 స్పూన్లు, జీలకర్ర - 2 స్పూన్లు
ములక్కాడలు - నాలుగు, తాలింపు గింజలు - సరిపడినంత
నూనె - 150 గ్రా॥, ఉప్పు-కారం - సరిపడా

తయారుచేసే పద్ధతి :

పెసరపప్పును శుభ్రంగా కడిగి తగుమాత్రం నీళ్ళు పోసి ఉడకనివ్వాలి. బంగాళదుంప, ములక్కాడల చెక్కుతీసి ఉడికించాలి. తర్వాత వాటిని ఉడుకుతున్న పెసరపప్పులో వేసి కొబ్బరి కోరు, మిర్చి, జీలకర్ర మిక్సీలో ముద్దగా చేసుకోవాలి. ఈ ముద్దను కూటులో వేసి బాగా కలిపి కాసేపు ఉడికిన తర్వాత పోపు పెట్టి దింపుకోవాలి.

తోటకూర కూటు

కావలసినవి

తోటకూర - 4 కట్టలు, పెసరపప్పు - 100గ్రా॥
పచ్చిమిర్చి - ఇరవై, కొబ్బరి తురుము - 3 చెక్కలు
జీలకర్ర - 2 స్పూన్లు, పసుపు - కొద్దిగా
ఉప్పు - సరిపడా, నూనె - 100 గ్రా॥
తాలింపు గింజలు - సరిపడినన్ని

తయారు చేసే పద్ధతి

పెసరపప్పును రాళ్ళు లేకుండా శుభ్రంగా కడిగి నీళ్ళుపోసి ఉడికించాలి. తోటకూర శుభ్రంగా కడిగి తురిమి ఉడుకుతున్న పప్పులో వేసి పసుపు, ఉప్పు వేసి మూతపెట్టాలి. మిర్చి, కొబ్బరి తురుము, జీలకర్ర కలిపి మిక్సీలో వేసి మెత్తగా చేయాలి. దీన్ని ఉడుకుతున్న పప్పులో వేసి ఉడికించి పోపు పెట్టి ఉడికిన కూటులో కలుపుకోవాలి.

శనగపప్పు వంకాయ కూటు

కావలసినవి

శనగపప్పు - 6 స్పూన్లు, లేత వంకాయలు - 6
కొబ్బరి - 1 చిప్ప, శనగలు - 100 గ్రా॥
చింతపండు - 100 గ్రా॥
ధనియాలు - 2 స్పూన్లు,
మినపప్పు - 2 స్పూన్లు
తాలింపు గింజలు - సరిపడినన్ని
పసుపు - కొద్దిగా
ఉప్పు-కారం - చాలినంత
నూనె - 200 గ్రా॥



తయారుచేసే పద్ధతి

పచ్చి శనగలను ముందు నానబెట్టి ఉంచుకోవాలి. వంకాయల్ని తరిగి ఉప్పు నీటిలో వేయాలి. నానిన శనగలు, వంకాయ ముక్కల్ని చింతపండు రసంలో కలిపి ఉడికించాలి. శనగపప్పు, ధనియాలు, మినపప్పు వేపి పచ్చిమిర్చి, కొబ్బరి, ఉప్పు కలిపి మిక్సీలో వేసి ముద్దగా చేసి ఉడుకుతున్న కూరలో వేసి కలపాలి. ఉడికాక తాలింపు పెట్టి కొత్తిమీర జల్లి దింపితే శనగపప్పు వంకాయ కూటు రెడీ.

క్రైమ్ కథ

ఫ్యాక్షన్ చావు

- యర్నాగుల సుధాకరరావు

నిర్మానుష్యమైన రోడ్డుమీద మిట్ట మధ్యాహ్నం నిలబడున్నాడు జక్కన్న. గుబురుగా పెరిగిన గడ్డం, జైలు తిండితో శుష్కించిన దేహంతో ఒకరకమైన అలసటగా చెట్టునీడన నిలబడ్డాడు. తాను ఖూనీ చేసినపుడు వేసుకున్న బట్టలనే వేసుకున్నాడు. ఎంతో ప్రయత్నిస్తే ఈరోజు పెరోల్ దొరికింది. పుట్టినగడ్డమీదకు వస్తే ప్రత్యర్థులు తనను ప్రాణాలతో వదలరు. అయినా ఈరోజు వెళ్లక తప్పదు.తనతో తిరిగే మిత్రుడు దాసును ప్రత్యర్థులు చంపేసారు. ఇప్పుడాతని కూతురుకు పెళ్లి. జైలుకు వచ్చి మరీ చెప్పింది దాసు ఇల్లాలు.పెళ్లికి వెళ్లి సుష్టుగా తినేందుకు తాను వెళ్లడంలేదు. తాను వెడితేగాని ఆపెళ్లి కాదు. కట్నంకింద బంగారం ఒప్పుకుంది దాసు భార్య. ఆ బంగారం తాను ఇప్పుడు ఇవ్వబోతున్నాడు. మనస్సు గజిబిజిగా ఆలోచిస్తోంది. గ్రామానికి ఉత్తరదిశలో కొండలున్నాయి. అక్కడికి చేరుకోవాలి. ఎవరిదృష్టిలో పడకుండా తాను పాతిపెట్టిన బంగారం వెలికితీసి అందులో కొంత దాసు భార్యకు ఇవ్వాలి. చీకటిపడితే ఆకొండలలో ఎలుగుబంట్లు కిందకి వస్తాయి. వాటిబారిన పడితే అవి చంపేవరకు వదలవు.

జక్కన్నలో ఆలోచనలు సుడులు తిరుగుతుండగా ఎదురుగా మోటార్‌బైక్ వస్తుంటే చేయి ఊపుతూ లిఫ్టు అడిగాడు. వెంటనే ఆపాడు బైక్‌వాలా. వెనక ఎక్కి కూర్చున్నాక 'ఎక్కడికి బాబు వెడుతున్నావు?' అడిగాడు జక్కన్న.

ఆయువకుడు దానికి బదులీయకుండా "ఏమిటి నిర్మానుష్యంగా ఉన్న రోడ్డుమీద ఉన్నావు. నీతీరు అదోలా ఉంది. ఎవర్నువ్?" అని ఏదో అడగాలని అడిగి స్పీడు పెంచాడు.

"పెరోల్‌మీద వస్తున్నాను. నాలుగేళ్లక్రితం కిరాయికి ఒక ఖూనీ చేసాను. అలా చేయక తప్పలేదు. గ్రామం అన్నాక ఇద్దరు నాయకులు తప్పకుండా ఉంటారు. మాలాంటివారు ఏదో ఒకవైపు ఉంటాం నాలా కొద్దిగా ధైర్యం ఉంటే హత్యలు చేయవచ్చు. లేకుంటే ముఠాలో ఉంటూ చిన్నచిన్న నేరాలు చేసుకుని పొట్టపోసుకోవడమే" చెప్పి వేదాంతిలా నవ్వాడు.

ఆమాటలకు ఒక్కసారి కంపించిపోయాడు ఆ యువకుడు. "వ్వాట్ నువ్వు హంతకుడివా? మైగాడ్ ఇప్పుడు నాకు ఏమి ప్రమాదం తలపెట్టవు కదా! అందులో కిరాయికి హత్య చేశానన్నావు. అంటే నీకు మనస్సు అనేది లేదు" తడబడుతూనే అడిగి బైక్ ఆపాడు.

"అలాంటి ఆలోచనలకు పోవద్దు. నిన్నేమి చేయను. అయితే నాకో సాయం చేయాలి. అదేమంటే నువ్వు బంట్లు కొండలలో నన్ను విడిచి వెళ్లిపో! అక్కడ నాకు వేరేపని ఉంది"

"నన్ను వదిలేయ్. నేను నాదారిన పోతాను. నావద్ద ఏమీలేదు. కావాలంటే నామోటర్ బైక్ తీసుకుని వదిలేయ్. ఈరోడ్డుమీద ఏదో బస్సు ఎక్కి నాదారిన నేను పోతాను. నువ్వు ఆకొండల్లోకి తీసుకుపోయి నన్ను చంపి ఈబైక్ తీసుకుపోవద్దు" భయంగానే చెప్పాడు.

"ఛ ఏమి ఆలోచన? నిన్నెందుకు చంపుతాను. నేను వచ్చింది పెరోల్‌మీద. పైగా నాకు మోటార్‌బైక్ ఎందుకు? నేను ఎంతటి కిరాయి నేరగాడినైనా అకారణంగా చంపను. అందులో నీలాంటి చిన్నవాడిని చంపితే నాకేమొస్తుంది. నన్ను నమ్మి ఆకొండల్లో వదిలి నీదారిన నీవు పో!"

"నన్నేం చేసినా కొండల్లోకి రానుగాక రాను. కావాలంటే బైక్ ఇస్తాను. కొండల్లో నీపని పూర్తి చేసుకుని వచ్చేయ్. నేను ఇక్కడ ఒకగంట వెయిట్‌చేస్తాను. ఆపైన బైక్ వదిలి వెళ్లిపోతాను" చెప్పి బైక్ ఆపేసాడు. జక్కన్న బైక్‌మీద ఒంటరిగా దూసుకుని వెళ్లాడు. తాను వెలికితీయాల్సిన బంగారం తీసాడు. అందులో తాను దాసు భార్యకు ఇవ్వాల్సినది మాత్రమే తీసి మిగిలింది పాతిపెట్టి బైక్ ఎక్కాడు. గ్రామం చివరిలో ఉన్న ఆలయం వద్దకు దాసుభార్య వస్తానందని అక్కడకు వెళ్లి ఎదురు చూసాడు. అనుకున్నవేళకు వచ్చింది.ఆమెకు ఇవ్వాల్సింది ఇచ్చాడు. అప్పుడే చుట్టుముట్టారు ప్రత్యర్థులు. వారిని చూడగానే జక్కన్న పారిపోవాలని ఆలయం నుంచి పరుగులుతీసాడు. అప్పటికే తుపాకి పేలింది. తూటా తొడలోకి దూరి నేలమీద పడేట్టుచేసింది.

జక్కన్నను ఎత్తిపట్టుకున్నారు. వారిని ప్రాధేయపడింది దాసుభార్య "నాబిడ్డపెళ్లికి ఏదో సాయపడడానికి తెగించి వచ్చాడు. శిక్ష అనుభవిస్తున్నాడు. అతడిని వదిలేయండి" అని కాళ్లావేళ్లా పడింది.

ప్రత్యర్థి సన్నగా నవ్వాడు."కలుగులో ఎలుకను పొగబెట్టి బయటికి తీసుకుని రాలేకపోయాం.వీడు పెరోల్ కోసం అప్లయ్‌చేసాడని విని అది వర్కవుట్ అయ్యేందుకు ఖర్చుచేసాం. ఈలోగా మా చేతుల్లో చచ్చిన బిడ్డపెళ్లికి ధనసాయం చేస్తానని వీడు దాసుకు మాటిచ్చాడు. వెంటనే నీకూతురుకి మంచి వరుణ్ణి మేమే వెనుక ఉండి సమకూర్చాం. జైలు నుంచి వచ్చి కొండల్లో దాచిన బంగారాన్ని తవ్వుతుండగా నీడల్లా వెంటాడి పసిగట్టాం. వీడు అందులో కొంత తెచ్చి నీకిచ్చాడు. మిగిలింది మేము తెచ్చాం. ఎలా ఉంది మా పథకం. నాతమ్ముడిని కిరాయికి చంపేసి వాడి ఇంట్లో ఉన్న బంగారం దోచుకుని పోయిన వీడిని ఫ్యాక్షన్‌రూల్ ప్రకారం చంపేయాల్సిందే"

జక్కన్న రక్తస్రావం కావడంతో నేలమీద తలాన్చి "అమ్మా నేను మాటిచ్చినట్లే నీకు సాయంచేసాను. శుభమా అని పెళ్లి చేస్తున్నావు. నాచావు చూసి వెళ్లకు. ఇది మనకు మామూలే. చంపడం చావడం ఇదేకదా! రేయ్ చచ్చేముందు చిన్న కోరిక తీర్చండి. నేను నడిపే మోటార్ బైక్ కోసం ఒక కుర్రాడు గూడెం రోడ్డులో ఎదురు చూస్తుంటాడు. అతడికి ఈబైక్ అప్పగించేయండి. అతడి వలన నేను బంగారం దాచిన చోటును మీరు చూసారు. నేను మీకు చిక్కిపోయాను.ఇన్ని ఉపకారాలు మీకు జరిగాయి"

ఆమాటలకు ప్రత్యర్థి పకపకమని నవ్వాడు.

"ఆకుర్రాడిని ఏర్పాటుచేసింది మేమేరా! మాపని త్వరగా కావాలంటే నీకు మోటార్‌బైక్ అందేలా చేసాం"

ఆసారి జక్కన్న తెరతెరలుగా నవ్వాడు."అయితే నేను ఏదిగులు లేకుండా హాయిగా చావచ్చు" అని పెద్దగా నవ్వుతుండగా వేటకొడవళ్లు ఒక్కసారి జక్కన్నను కమ్మేసాయి.ఆ నవ్వు అలా ఆగిపోయింది.

కనుగుడ్లలో నీళ్లు ఉబికివస్తుండగా బంగారాన్ని గట్టిగా ఒడిసి పట్టుకుని దాసు భార్య వెనక్కి అడుగులు వేసింది.

★

వారిని చూడగానే జక్కన్న పారిపోవాలని ఆలయం నుంచి పరుగులుతీసాడు. అప్పటికే తుపాకి పేలింది. తూటా తొడలోకి దూరి నేలమీద పడేట్టుచేసింది. జక్కన్నను ఎత్తిపట్టుకున్నారు. వారిని ప్రాధేయపడింది దాసుభార్య "నాబిడ్డపెళ్లికి ఏదో సాయపడడానికి తెగించి వచ్చాడు. శిక్ష అనుభవిస్తున్నాడు. అతడిని వదిలేయండి" అని కాళ్లావేళ్లా పడింది.

ఫ్యామిలీ స్పెషల్



విశేషమేమిటంటే, ఇరవయ్యవ శతాబ్దంలోనే అమెరికా, కెనడాలలో ఈ పండు ప్రాచుర్యం పొందింది. కాలిఫోర్నియాలో అయితే విస్తారమైన దానిమ్మ తోటలున్నాయి. ప్రస్తుతం ఎన్నోరకాల దానిమ్మలు లభ్యమౌతున్నాయి వాటిలో దేనికదే వేర్వేరు రుచులలో వుంటుంది. కొన్ని చాలా తీయగా వుంటే ఇంకొన్ని కాస్త వగరుగా వుంటాయి. దానిమ్మను చాలా ప్రాంతాలలో కాస్త ప్రత్యేకంగా పరిగణిస్తారు. దానిమ్మ ప్రస్తావన బైబిల్‌లో కూడా వుంది. కొంతమంది యూదులు దేవుడు నిషేధించిన ఫలం ఆపిల్ కాదు, దానిమ్మే అని విశ్వసిస్తారు. ప్రాచీన ఐగుప్తులు (ఈజిప్ట్ ప్రజలు) దానిమ్మని సంతాన సమృద్ధికి చిహ్నంగా భావిస్తారు. ఇక ప్రాచీన రోమన్లైతే దానిమ్మ పండు తొక్కని కొన్ని రకాల వస్తువులలో చర్మం బదులు వాడేవారట. బౌద్ధులు దానిమ్మను పవిత్రఫలంగా భావించేవారు. టర్కీలో చాలా నగరాలకు దానిమ్మ అధీకృత చిహ్నం. ఆఫ్ఘనిస్తాన్‌లోని కాందహార్ అత్యంత నాణ్యమైన దానిమ్మలకు ప్రసిద్ధి.

ఆరోగ్య ప్రదాయిని దానిమ్మ

'ఎండాకాలం వెళ్లిపోతోంది' అనుకోవడంతోనే కాలం గడిచిపోతోంది గానీ ఎండలు తగ్గడం లేదు. మామిడి పళ్ల రుచి తగ్గాయి. పుచ్చకాయలు కనిపించడం తగ్గాయి. కర్జూరాలూ, నారింజలూ అసలు కనిపించడం లేదు. ద్రాక్ష మళ్లీ ఏడాది ఎండాకాలం వరకూ ఆగాలి. ఫర్వాలేదు. ఈ కాలానికి ఇంకొన్ని పళ్ల తయారుగా వున్నాయి. అటువంటి వాటిలో ఒకటి దానిమ్మ. మనిషికంటే కాస్త ఎత్తు చెట్టుకి ఎర్రని పండ్లలా కాసే దానిమ్మకి ఒక ప్రత్యేకత వుంది. అన్ని పళ్లలా కాకుండా, దానిమ్మలో గింజలు అధికం. ఆ గింజల చుట్టూ నీటితో నిండిన రుచికరమైన 'కండ' ప్రత్యేకం. దానిమ్మ పైన తొక్క మందంగా వుంటుంది. దాన్ని వొలిస్తే ఆకర్షణీయమైన వరసలలో ఎర్రని గింజలు అమరివుండటం ఆశ్చర్యంగా అనిపిస్తుంది. అందుకే కాబోలు మంచి పలువరస ని దానిమ్మ గింజలతో పోల్చుతారు.

దానిమ్మ తినడంలో కొంతమంది వాటిలోని గట్టి గింజలని వూసేస్తే చాలామంది మాత్రం వాటిని నమిలి మింగేస్తారు. అందువల్ల అసలు రుచిలో కాస్త తేడా వున్నా, గింజలతో పాటు తినడమే మంచిది. లేదంటే రేగుపళ్లలా ఒక్కో గింజనీ చప్పరించి వూయాల్సి ఉంటుంది.

మిగతా చాలా పండ్లలా దానిమ్మ వల్ల కడుపు నిండటం గానీ, ప్రత్యేకమైన తృప్తి కలగడంగానీ వుండకపోవడం మరో విశేషం. ఎంత తిన్నా అదేదో కాలక్షేపానికి తిన్నట్టు వుంటుంది. అయినా, దానిమ్మ పండు ఆరోగ్యానికి ఒక అద్భుత వరం వంటిదంటే నమ్ముతారా? తప్పదు, నమ్మాలి మరి. దానిమ్మ రసం డయేరియాకి మంచి విరుగుడు. ఆ రసంలో విటమిన్ 'సి'తో పాటు 'బి5' కూడా లభ్యమౌతుంది. క్రమబద్ధంగా దానిమ్మని తింటే హృద్రోగాల రాకను నివారించవచ్చని తేలింది. దానిమ్మ రసం రక్తపోటుని అధికం కాకుండా చేయడంలో తోడ్పడుతుంది. అంతే కాకుండా వైరస్ సంబంధ ఇన్‌ఫెక్షన్లు రాకుండా నిరోధిస్తుంది. దంతాలపై 'ప్లాక్' ని అరికడుతుంది.

పుట్టింది పర్షియాలో...

దానిమ్మ ప్రాచీన పర్షియా ప్రాంతంలో ఆవిర్భవించిందని అంటారు. ఆ మేరకు క్రీస్తు పూర్వం 1000 సంవత్సరాల నాటి గింజలు, మొక్కల ఆనవాళ్లు కూడా లభించాయి. ఇప్పటికీ ఇరాన్ (అప్పటి పర్షియా)లో దానిమ్మ మొక్కలు విరివిగా కనిపిస్తాయి. ఆ తరువాత క్రమక్రమంగా విశ్వవ్యాప్తమయింది దానిమ్మ. విశేషమేమిటంటే, ఇరవయ్యవ శతాబ్దంలోనే అమెరికా, కెనడాలలో ఈ పండు ప్రాచుర్యం పొందింది. కాలిఫోర్నియాలో అయితే విస్తారమైన దానిమ్మ తోటలున్నాయి. ప్రస్తుతం ఎన్నోరకాల దానిమ్మలు లభ్యమౌతున్నాయి. వాటిలో దేనికదే వేర్వేరు రుచులలో వుంటుంది. కొన్ని చాలా తీయగా వుంటే ఇంకొన్ని కాస్త వగరుగా వుంటాయి. దానిమ్మను చాలా ప్రాంతాలలో కాస్త ప్రత్యేకంగా పరిగణిస్తారు. దానిమ్మ ప్రస్తావన బైబిల్‌లో కూడా వుంది. కొంతమంది యూదులు దేవుడు నిషేధించిన ఫలం ఆపిల్ కాదు, దానిమ్మే అని విశ్వసిస్తారు. ప్రాచీన ఐగుప్తులు (ఈజిప్ట్ ప్రజలు) దానిమ్మని సంతాన సమృద్ధికి చిహ్నంగా భావిస్తారు. ఇక ప్రాచీన రోమన్లయితే దానిమ్మ పండు తొక్కని కొన్ని రకాల వస్తువులలో చర్మం బదులు వాడేవారట. బౌద్ధులు దానిమ్మను పవిత్రఫలంగా భావించేవారు. టర్కీలో చాలా నగరాలకు దానిమ్మ అధీకృత చిహ్నం. ఆఫ్ఘనిస్తాన్‌లోని కాందహార్ అత్యంత నాణ్యమైన దానిమ్మలకు ప్రసిద్ధి.

దానిమ్మ–పోషకవిలువలు

వందగ్రాముల దానిమ్మ గింజలలో

కార్బోహైడ్రేట్లు – 17 గ్రా

చక్కెర పదార్థాలు –16గ్రా

పీచు పదార్థాలు – 0.6 గ్రా

కొవ్వు – 0.3 గ్రా

ప్రోటీను – 0.95 గ్రా తో పాటు

థయామిన్ (బి$_1$), నియాసిన్ (బి$_3$), రైబోఫ్లేవిన్(బి$_2$), పాంటోథెనిక్ ఆమ్లం (బి$_5$), విటమిన్ సి, కాల్షియం, ఇనుము, మెగ్నీషియం, ఫాస్ఫరస్, పోటాషియం, జింకు వంటి సూక్ష్మ పోషకాలు కూడా వున్నాయి.

యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు దానిమ్మలో చాలా అధికం. సాధారణంగా ఈ లక్షణాలు గ్రీన్ టీ, వైన్‌లలో ఎక్కువని అంటారు. కానీ దానిమ్మలో వాటికి మూడురెట్లు అధికంగా ఈ లక్షణాలు వున్నాయి.

ఇంతటి విశేషమైన దానిమ్మ పండుని వీలైనపుడల్లా తినాలి. మన ప్రాంతాలలో దద్దోజనం వంటి పదార్థాలలో దానిమ్మ గింజల వాడకం పరిపాటి. కానీ మరే ఇతర రకంగానూ వాడరు. అదే విదేశాలలో అయితే దానిమ్మ జ్యూస్, సాస్, జామ్ వంటివెన్నో లభిస్తున్నాయి. ఇటీవలి కాలంలో బరువు తగ్గే ప్రయత్నాలు చేశేవారు దానిమ్మ రాసాన్ని తాగుతున్నారు.

దానిమ్మ పండే కాక, చెట్లు, పూలు, ఆకులు కూడా ఆయుర్వేదంలో ఔషధ మూలాలుగా ఉపయోగపడుతున్నాయి. మరో మాట దానిమ్మ చెట్టు వంద సంవత్సరాల వరకూ జీవించివుంటుందని అంటారు. చాలా రకాల పండ్ల చెట్లలా కాకుండా దానిమ్మ పూలు కూడా అందంగా వుంటాయి. పైగా ఆ మొగ్గలు ఎంత ప్రాచుర్యం పొందాయో తెలియాలంటే 'అనార్కలీ'ని గుర్తు తెచ్చుకుంటే చాలు!

★

కథ



గతవారం జరిగినకథ:

అతనో రచయిత. కడు పేదవాడు. ఇంటి అద్దె కట్టడానికి కూడా పైసలుండవు. ఇంటి యజమాని దగ్గర నుంచి హోటల్ యజమాని వరకూ అప్పులు...బకాయిలే. ఆరోజు అతని పుట్టినరోజు. కనీసం ఆనాడైనా మిగతా రోజులకు భిన్నంగా గడపాలనుకుంటాడు. కానీ టీ తాగే స్థోమతు కూడా అతనికి వుండదు. దాహం...ఆకలితో కళ్లు తిరిగి పడిపోయేట్టుంటాడు. ఇక లాభం లేదనుకొని ఒకప్పటి పత్రికా సంపాదకులు శ్రీ దగ్గరకెళతాడు. ఆ తర్వాత...

పుట్టిన రోజు

మళయాళీ మూలం : వైకమ్ మహమ్మద్ బషీర్
తెలుగు : డాక్టర్ దేవరాజు మహారాజు

కుర్రాడు టీ తేగానే శ్రీగారు కప్పు పై కెత్తి తాగబోతూ "టీ తాగుతారా?" అని అడిగాడు. "వద్దు " అన్నాను. షూలేస్ సరిగా కట్టుకోవడానికన్నట్లు కిందికి వంగాను. నా ముఖ కవళికలు అతనికి కనబడకుండా ఉండాలని ప్రయత్నం.

"మీరు నాకు మీ పుస్తకాలివ్వ లేదు"

"వాటి మీద వస్తున్న సమీక్షలు చదువుతున్నాను"

"సంతోషం" నవ్వడానికి ప్రయత్నించాను. కాని, హృదయంలో లేని వెలుగు ముఖం మీదికి ఎలా వస్తుంది? లేచి వీధిలోకి నడిచాను. సి.ఐ.డి. ఇంకా నన్ను అనుసరిస్తూనే ఉన్నాడు.

రెండు గంటలు:

నా గదిలోని పడక కుర్చీలో వచ్చిపడ్డాను. నిరాశ, నిస్పృహ, అలసట, నిస్సహాయత....ఉన్నఫళంగా పెర్ఫ్యూమ్ వాసన ముక్కుకు తగిలింది. వెనువెంటనే చక్కగా అలంకరించుకున్న యువతి వచ్చి నా గది ముందు నిలబడింది. ఆమె ఎక్కడో దూర ప్రాంతం నుండి వచ్చిందట. వరదల వల్ల ఇల్లూవాకిలి కోల్పోయిందట. ఆమెకు ఏదైనా సహాయం కావాలట. తేలికపాటి చిరునవ్వుతో ఆమె నన్ను చూస్తూ పరిచయం చేసుకుంది. గుమ్మానికి రొమ్ములు ఒత్తిపట్టి వయ్యారంగా నిలబడింది. హృదయంలో ఎక్కడో బీజం నాటుకుంది. పక్కగదుల్లో ఎవరూ లేరు. అంత నిస్సత్తువలో కూడా ఆ బీజం నా రక్తనాళాల్లో, నాడుల్లో విస్తరించింది. నా గుండె చప్పుడు నాకే వినిపిస్తున్నట్టయ్యింది. అది ఒక ప్రమాద సంకేతాన్ని తెలిపిన క్షణం.

"లేదు సిస్టర్. నా దగ్గర ఏమీ లేదు. వేరేవాళ్ళనడగండి" అన్నాను ముభావంగా

భరించలేనట్లు ఆమె 'హుష్' అంటూ ఒక దీర్ఘ నిట్టూర్పుతో పాటు వెనక్కి తిరిగి, విసవిసా నడిచి వెళ్ళింది. ఆమె వెళ్ళినా పెర్ఫ్యూమ్ వాసన మాత్రం కాసేపు అక్కడే తచ్చాడింది.

మూడు గంటలు:

ఎవరి దగ్గరైనా అడుక్కుంటే ఏమౌతుంది? భరించలేని ఆకలి. అసహాయాతా బీభత్సం. అడుక్కోవడమా? ఆత్మగౌరవం దెబ్బతినదూ; చచ్చిపోతే పీడాపోతుంది. చావు ఎలా ఉంటుందో?

మూడున్నర:

నాలుక పిడచగట్టుకుపోయింది. గొంతూ, కడుపూ తడిలేక చిట్లుతున్నట్టుంది. చల్లటి సముద్రంలో నిండా మునిగితేగాని నేను నా స్వాధీనంలోకి రాను. పత్రికా సంపాదకుల నుండి ఉత్తరాలు వచ్చాయి. తిరుగుటపాలో కథలు పంపమని! ఉత్తరాలు కింద గిరాటేసి పడుకున్నాను. క్రిష్ణపెళ్ళై బ్యాంక్ క్లర్కు దగ్గర పనిచేసే కుర్రవాడొచ్చాడు. అగ్గిపెట్టె కావాలని! మంచి నీళ్ళు కావాలని సైగ చేశాను. కుర్రాడు వెంటనే తెచ్చి ఇచ్చాడు. మంచి నీళ్ళు తాగాను.

"ఒంట్లో బాగాలేదా?" అనుమానంగా అన్నాడు వాడు.

"బాగానే ఉంది"

"మరేమైంది? ఏమీ తినలేదా?"

"లేదు"

"అయ్యో ఏం? ఎందుకు తిన్లేదూ" మురికిబట్టల్లో ఉన్న ఆ చిన్నారి ముఖం నల్లకళ్ళు అలాగే నిలబడి ఉన్నాయి. నేనేం చెబుతానో అని! నేను కళ్లు మూసుకున్నాను. కాసేపటికి వాడు మళ్ళీ పిలిచాడు "సార్"

"ఊఁ " –నేను మెల్లగా కళ్ళు తెరిచాను.

"నా దగ్గర రెండణాలున్నాయండి"

"అయితే"

"వచ్చేనెల నేను ఊరికి వెళతాను" వాడు కాస్త తడబడుతూనే చెప్పాడు.

"అప్పటికి మీరు తిరిగి ఇచ్చేస్తే సరిపోతుంది"

ఆ మాటతో నేను కదిలిపోయాను– అంత చిన్నవాడికి అంత పెద్ద మనసా? "తీసుకురా!" అన్నాను. నా మాట పూర్తికాక ముందే వాడు పరిగెత్తాడు.

అప్పుడే మిత్రుడు గంగాధర్ వచ్చాడు. తెల్ల ఖద్దరు ధోవతి, ఖద్దరు జుబ్బా. భుజాల మీద నీలిరంగు శాలువా? ఏమీ పట్టనట్టు పడక కుర్చీలో పడుకుని ఉన్నానని నావైపు అసహనంగా చూస్తూ అన్నాడు. "తమరు నిజంగానే బూర్జువా లాగున్నారు" నా తల తిరిగి పోతున్నా... ఓ

బలహీనపునవ్వు నవ్వాను. నా ఎదురుగా ఉన్న ఈ ఛోటా లీడర్ ఎవరి బట్టలు వేసుకు వచ్చాడో? నాకు తెలిసిన పెద్ద పెద్ద నాయకులంతా నా మనసు కళ్ల ముందు నుండి కదలిపోయారు. అవన్నీ ఎవరి బట్టలు? ఎవరి డబ్బులు?

"ఎందుకు నవ్వుతున్నారా?" గంగాధర్ అడిగాడు.

"ఏం లేదయ్యా! పిడుగులా ఊడిపడ్డావేమని"

"జోకులొద్దు. మన ముందు గొప్ప ప్రమాదముంది. మూడు వేలమంది కార్మికులు సమ్మెలో ఉన్నారు. వారం నుండి వారికి తిండి లేదు. ఇంతకంటే ఇంకా తీవ్రమైన ప్రమాదాలు ముందు రాబోతున్నాయి"

" అలాగా? నేను ఏ వార్తా పత్రికలోనూ చూళ్ళేదే?"

"వార్తా పత్రికలు ఈ వార్తను ప్రచురించొద్దని ఆంక్ష విధించారు"

"అవునా? అయితే దీని గురించి నన్నేం చేయమంటావు చెప్పు"

"దీని గురించే ఈ సాయంత్రం సభ ఉంది. దానికి నేనే అధ్యక్షుణ్ణి. బాధితుల కోసమని ప్రతి ఒక్కరి నుండి అణా చొప్పున వసూలు చేస్తున్నాం. ఇకపోతే ఇవ్వాళ నేనేమీ తినలేదు. మిమ్మల్ని నాతో తీసుకెళదామని వచ్చాను.

"అలాగా- అంతా బాగానే ఉంది కాని బాబూ! ప్రస్తుతం నా చేతిలో ఒక్క పైసా కుడా లేదు. ఓ ముద్ద తిని ఎన్ని రోజులైందో తెలియదు. పైగా ఇవ్వాళ నా పుట్టిన రోజు. ఇంతవరకు ఏమీ తినలేదు. ఆగు ఓ నిమిషం... చూద్దాం!"

గంగాధర్ కార్మికుల గురించి, జాతీయతా భవనం గురించి, ప్రభుత్వం గురించి మాట్లాడాడు. నేను పత్రికల గురించి, సంపాదకుల గురించి మాట్లాడాను. ఇంతలో కుర్రవాడొచ్చాడు. వాడి దగ్గర ఒక అణా తీసుకుని, మిగిలిన అణాతో టీ, దోసె, బీడీలు పట్టుకు రమ్మని చెప్పాను. ఉన్నఫళంగా మాయమై కుర్రవాడు అక్కడ ఉన్నట్టుగా తిరిగొచ్చాడు. పాపడ్ లాంటి చిన్న దోసె, రెండు ఔన్సుల టీ కొన్ని బీడీలు తెచ్చాడు. దోసె చుట్టుకొచ్చిన అమెరికా దినపత్రికలో ఓ దృశ్యంపై నా కన్ను పడింది. నేనూ గంగాధర్ సగం సగం దోసె తిని, మంచినీళ్ళు తాగాం. తర్వాత టీ. నేనో బీడీ వెలిగించి ఒకటి గంగాధర్ కిచ్చాను. ఆ తర్వాత నాదగ్గరున్న అణా బాధితుల కోసమని చెప్పి, గంగాధర్ చేతిలో పెట్టాను.

గంగాధర్ వెళ్ళిపోతూ "ఆఁ ఈ రోజు మీ పుట్టిన రోజు కదా? ప్రపంచానికి మీరిచ్చే సందేశమేమైనా ఉంటే చెప్పండి" అన్నాడు ఏదో జోక్ చేస్తున్న వాడిలాగా ముఖం పెట్టి.

"అవును బాబు ఇస్తాను. విప్లవం గురించి"

"అయితే చెప్పండి"

"విప్లవ జ్వాలలు ప్రతిచోటా ఎగిసి పడాలి. ఇప్పటి ఈ సామాజిక వ్యవస్థ తగలబడి బుగ్గి కావాలి! ఒక కొత్త ప్రపంచం ఆవిర్భవించాలి!!!"

"బావుంది. ఈ సందేశం కార్మికలోకానికి అందిస్తాను" అంటూ గంగాధర్ గబగబా వెళ్ళిపోయాడు.

నేను జాతీయోద్యమ నాయకుల గురించి, రచయితల గురించి ఆలోచించాను. వాళ్ళంతా ఎలా బతికారు? అని ఆలోచిస్తూ, దోసె చుట్టుకొచ్చిన రద్దీ కాగితం ముక్క వెలికి తీసుకున్నాను. అప్పుడే ఇంటి యజమాని కోపంతో ఉడికిపోతూ నావైపు వస్తున్నట్టు గమనించాను. కాగితం మీది చిత్రాన్ని పరిశీలనగా చూస్తూ ఉన్నాను. ఆకాశ సౌధాల మధ్య ఓ మనిషి తలెత్తి చూస్తున్నాడు. అతను ఇనుపగొలుసులతో భూమికి కట్టి వేయబడి ఉన్నాడు. కాని అతని చూపు గొలుసుల మీద లేదు. భూమి మీద లేదు. దిగంతాల నుండి ప్రసరిస్తున్న ఏదో ఒక అనంతమైన శక్తివైపు, వెలుగువైపు ఉంది! ఆ ముఖంలో ప్రసన్నతా గాంభీర్యం ఉంది. ఆగామి కాలాలలోంచి సుదీర్ఘంగా సాగి వస్తున్న ఆ కాంతి పుంజాల మీద నిలిపిన అతని దృష్టి నిశ్చలంగా, నిబ్బరంగా ఉంది. అతని కాళ్ళ కింద ఒక తెరచిన పుస్తకం ఉంది. అందులో పెద్ద అక్షరాలతో ఓ వాక్యం ఇలా రాసి ఉంది. అది అతడి చరిత్ర మాత్రమే కాదు, మొత్తం మానవజాతి చరిత్ర కూడా అనిపించింది.

"బంధనాలలో మనిషి భూమికి బంధించబడి ఉన్నా. స్థల కాలాదులకు అతీతంగా అతని చూపు ఆగామికాలాలలో సాధించబోయే ప్రగతి పథం మీదే ఉంటుంది"

"ఇవాళయినా అద్దె ఇచ్చేదుందా?" అడిగాడు ఇంటి యజమాని నా వైపు తీక్షణంగా చూస్తూ.

"డబ్బులేవీ రాలేదు... ఇస్తాను. ఈకొద్ది రోజుల్లోనే"

అతడు నా మాటలేవీ వినదల్చుకోలేదు. "ఎందుకయ్యా! ఈ విధంగా బతకడం?" అసహ్యించుకున్నాడు. వచ్చినపుడు మూడు గదులున్న పోర్షను బాగు చేయించాను. అద్దె కట్టలేక, అంతగా నాకు అవసరమూ లేక కిచెన్‌లోకి మారాను. అదీ ఎక్కువై సామాను గదికి పరిమితమయ్యాను. నేనొకప్పుడు బాగు చేయించిన గదులకు ఇప్పుడు మంచి అద్దెలు వస్తున్నాయి. ఇప్పుడు నేనుండే ఈ చిన్న సామాను గదికి కూడా నా కంటే ఎక్కువ అద్దె ఇచ్చేవాళ్ళు వస్తున్నారని యజమాని అంటున్నాడు. అద్దె ఇవ్వలేకపోతే ఖాళీ చేయమని ఒత్తిడి చేస్తున్నాడు కూడా!

"లేదు. నేను ఈ గది ఖాళీ చేయను"

నాలుగు గంటలు:

పూర్తిగా అలసిపోయాను. అయినా నన్నాకర్షించేది ఈ పట్టణంలో ఏముంది గనక? అవే వీధులు, అవే ముఖాలు, అవే దుకాణాలు, రోజు తర్వాత రోజు అవే అవే విషయాలు. విసిగిపోయాను. ఒక్క ముక్క కూడా రాయలేక పోతున్నాను.

ఆరుగంటలు:

సాయంత్రం అందమైందే. ఎర్ర టొమాటో లాంటి సూర్యుణ్ణి సాగరుడు మింగేస్తున్నాడు. పశ్చిమాన బంగరు మేఘాలు కదలిపోతున్నయ్. తమకు అడ్డే లేదన్నట్లు సముద్రపు కెరటాలు నెమ్మదిగా ఒడ్డు మీదికి పాకుతూ వస్తున్నయ్. పువ్వు సుగంధాన్ని గాలులు ఎక్కడెక్కడినుండో మోసుకొస్తున్నాయి. యువకులు సుతారంగా సిగరెట్ పొగ రింగులుగా గాల్లోకి వదులుతున్నారు. అద్భుతమైన చీరలు కట్టుకుని ఆడవాళ్ళంతా ముసిముసి నవ్వులు నవ్వుతున్నారు. ప్రేమికుల హృదయాల్లో ప్రేమగీతాలు సుళ్ళు తిరుగుతున్నాయి. నిజమే. అద్భుతమే. కాని నేను మాత్రం మూర్ఛవచ్చి పడిపోయేట్లుగా ఉన్నాను.

ఏడుగంటలు:

నేనుండే చోటికి పోలీసు వాడొచ్చాడు. నన్ను తనతో తీసుకెళ్ళాడు. పెట్రోమాక్స్ ఎదురుగా కూర్చోమన్నాడు. నేను చెబుతున్న సమాధానాలు వింటూ నా ముఖ కవళికలు గమనిస్తూ డెప్యూటి కమీషనర్ అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు. నా ముఖం మీది నుండి అతని చూపు క్షణం సేపుకూడా తొలగలేదు. నేనేదో చేయరాని ఘోరమైన నేరం చేసినట్టు... ఒక గంట సేపు ప్రశ్నలడిగాడు. నా స్నేహితులెవరు? నాకు ఎక్కడెక్కడి నుండి ఉత్తరాలొస్తాయి? ప్రభుత్వాన్ని పడగొట్టాలని కుట్ర పన్నుతున్న నిషేధింప బడ్డ సంస్థ సభ్యుడినా? కొత్తగా ఏం రాస్తున్నాను? అంతా నిజమే చెప్పాలన్న హుకుం.

"నేను తలుచుకుంటే ఏం చేయగలనో తెలుసా?"

"మీ అంతటి వారెందుకు సార్? మామూలు కానిస్టేబుల్ అయినా చాలు. నా బోటి నిస్సహాయుణ్ణి లాకప్‌లో పెట్టి తన్నడానికి"

ఎనిమిదిన్నర:

నా గదికి తిరిగొచ్చాను. ఎలా వచ్చానో తెలియదు. చీకటి నిశ్శబ్దంలో కూరుకుపోయి ఉన్నాను. గదిలో దీపం లేదు. కిరోసిన్ ఎలా తేవడం? తినడానికి కూడా ఏమైనా కావాలి. ఎవరు పెడతారు? ఎవరిని ఏమీ అడగలేను. పోనీ మాథీవ్స్‌ని అడిగేదా? ఛ్ఛ. వద్దు. పక్క బిల్డింగ్‌లో సోడా కళ్ళద్దాల స్టూడెంటు కుర్రాడి దగ్గర ఓ రూపాయి తీసుకుంటాను. అతను జబ్బుపడ్డప్పుడు ఎంతో డబ్బు తగలేసి ఇంజక్షన్లు వాడాడు. జబ్బు తగ్గలేదు. చివరికి నేనిచ్చిన నాలుగణాల విలువగల చిట్కా వైద్యంతో తగ్గింది. అతనికి నేనంటే గౌరవం ఓ సారి సినిమాకు తీసుకుపోయాడు. ఇప్పుడు ఓ రూపాయి కావాలంటే కాదంటాడా?

ఎనిమిది నలభై అయ్యింది

దారిలో మాథీవ్స్ గురించి వాకబు చేశాను. అతను సినిమాకు వెళ్ళాడని తెలిసింది. పెద్దపెద్దగా మాట్లాడుకోవడాలు, పగలబడి బిగ్గరగా నవ్వడాలు వింటూ ఓపిక చేసి మెల్లగా పక్క బిల్డింగ్‌లోని పై అంతస్తుకు చేరాను! సిగరెట్‌పొగ వాసన. పెట్రోమాక్స్ వెలుగులు.....

(అయిపోయింది)

కొత్త పుస్తకాలు

నా తలరాత రాసిందెవరు?



'చేదు విషం జీవఫలం.. జీవ ఫలం చేదు విషం' అని మహాకవి శ్రీశ్రీ చెప్పారు. కొందరి జీవితాలు వడ్డించిన విస్తర్లు. కొంతమంది జీవితాల్లో పూట గడవని పరిస్థితులూ ఉంటాయి. 'దగడు' అనే పేరు మరాఠీది. తెలుగులో 'ఒరే పోలిగా!!' బాపతు. అది కాస్తా సుశీల్ కుమార్ షిండేలా మారిపోయింది. ఆ మాటకొస్తే వేల కొద్దీ హిందూ దేవుళ్ళకు మొక్కుకుంటే పుట్టాడని వినాయక చతుర్థినాడు పుట్టిన ఆ అబ్బాయికి బారసాలనాడు పెట్టుకున్న పేరు 'జ్ఞానోబా'. మహారాష్ట్ర ఆధ్యాత్మిక సాంప్రదాయంలో రుషితుల్యుడైన జ్ఞానేశ్వర్ ప్రభావం కావచ్చు. మొత్తానికి పేద దళితుల గారాల పట్టి చిన్నప్పటి నుండి అష్టకష్టాలు పడ్డాడు. బాల్యంలోనే ఇంట్లో పనివాడిగా, పదిహేనవ ఏట ఎనిమిదో తరగతి చదువుతూ బాల బంట్రోతు (అమీనా) గా కోర్టులోనూ పని చేసాడు. అలా పని చేస్తూ బి.ఏ. పూర్తి చేసాడు. గుమాస్తాగిరీ చేసాడు. 1965లో పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టరుగా ఎంపికయ్యాడు. అలనాటి మహారాష్ట్ర ముఖ్యమంత్రి యశ్వంత్‌రావ్ చవ్వాణ్, యువనేత శరద్‌పవార్ కళ్ళల్లో పడ్డాడు. లాయర్ గిరీ వదిలేసి రాజకీయాల్లో దూరాడు. ఓడిపోయి కాస్తంత కృంగిపోయాడు. ఆ తర్వాత దృఢశక్తి, అకుంఠిత పరిశ్రమ, కృతనిశ్చయంతో భారతీయ రాజకీయాలో చొచ్చుకొనిపోయాడు. మన రాష్ట్రానికి గవర్నర్‌గానూ వెలిగిపోయాడు. పుస్తకం ప్రారంభంలోనే కొన్ని అరుదైన పంక్తులున్నాయి. "ఈ పుస్తకం ఏ ఒక్కరి కోసమోకాదు. అందరికోసం ఉద్దేశించింది. అనాథలు, పేదలు, పేదరికంలో చిన్న చిన్న దొంగతనాలకు అలవాటు పడినవారు, మధ్యలో చదువులు చాలించుకున్న పిల్లలు, విద్యారంగంలో వెనుక పడి పోయిన పేదలు, అణగారి పోయినవారు, భగ్నప్రేమికులు, జీవితంలో వైఫల్యాల పరంపర చూసినవారు.. ఒకరేమిటి? అలాంటి వారికి ఈ పుస్తకం అంకితం..." ఆఖర్న మరో పంక్తి కూడా ఉంది.

"జీవితంలో సమున్నత స్థానాన్ని అందుకోవాలన్న తపనాగ్ని మీలో రగుల్కోకపోతే, దయచేసి ఈ పుస్తకాన్ని తెరవొద్దు తెరవొద్దు. చదవొద్దు..."

"అపజయాన్ని నీ ఓటమిగా భావించకు. వైఫల్యానికి అర్థం రేపు నీవు సాధించబోయే విజయానికి చిహ్నం అని భావించుకోవాలి. వైఫల్యానికి అర్థం నీవేమి సాధించలేదని కాదు. కొన్ని పాఠాలు నేర్చుకున్నావని మాత్రమే దాని అర్థం"

సుశీల్ కుమార్ షిండే- జీవితంలో సాధించిన విజయ పరంపరలకు ఈ సిద్ధాంతమే ప్రాతిపదికలుగా భావించాలి.

తొలిసారి ఎం.ఎల్.ఎ.గా గెలుస్తూనే మహారాష్ట్ర ప్రభుత్వంలో క్రీడలు, సాంస్కృతిక శాఖ సహాయ మంత్రిగా రాజకీయ ఇన్నింగ్స్ ప్రారంభించారు షిండే.. దాదాపు ప్రతిసారి ఏదో మంత్రిపదవి ఆయనను వరిస్తూ వచ్చింది.

భారత ఉపరాష్ట్రపతిగా పోటీపడి ఓడిపోయారు. ఆ తర్వాత మన రాష్ట్ర గవర్నర్ వెలిగి మళ్ళీ క్రియశీల రాజకీయాల్లో కేంద్రప్రభుత్వంలో విద్యుచ్ఛక్తి శాఖా మంత్రిగా కొనసాగారు. రాజకీయాలు అంతగా రుచించని పాఠకులు షిండే జీవితపు 'రోమాన్స్' ముచ్చట బస్సు మిస్సయినా విమానం దొరికింది' చదవండి ఈ అధ్యాయం కూడా ఒక గమ్మత్తైన అనుభూతి. హోల్ మొత్తం మీద 'దగడు' టు 'షిండే సాబ్' దాకా చదివించే, ఆలోచింపచేసే 312 విలక్షణమై పేజీల వృత్తాంతం 'నా తలరాత రాసిందేవరు?' అనే పుస్తకం.

- డా॥ జె.పి.వైద్య

నా తలరాత రాసిందెవరు?
(సుశీల్ కుమార్ షిండే జీవనగాథ- పి.ఆర్. సుభాష్ చంద్రన్)
తెలుగు సేత: డా॥ ఎ.బి.కె. ప్రసాద్
పేజీలు : 312,
వెల: రూ॥ 150/-
ప్రతులకు:
ఎమెస్కో బుక్స్
విజయవాడ/ హైద్రాబాద్.



తెలుగుతల్లి
కవితా సంకలనం
- పున్నమి
పేజీలు : 90, వెల: రూ॥ 60/-
ప్రతులకు:
పున్న అంజయ్య
తెలుగుభాషా పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు
సి41, హౌసింగ్ బోర్డ్ కాలనీ
రాజీవ్ పార్క్,
నల్లగొండ.

నిద్రిత నగరం
కవితలు
డాక్టర్ వైదేహి శశిధర్
పేజీలు : 72, వెల: రూ॥ 50/-
ప్రతులకు:
నవోదయ బుక్ హౌస్, కాచిగూడ,
హైదరాబాద్.
మైత్రి బుక్ హౌస్, జలీల్ స్ట్రీట్, అరండల్ పేట్,
విజయవాడ.
విశాలాంధ్ర, ప్రజాశక్తి అన్ని బ్రాంచిలు







పసివాళ్లకు కాసేపు అమ్మ కనిపించకపోతే... ప్రాణవాయువు అందనట్టు గిలగిలలాడిపోతారు. కళ్ల నిండా నీళ్లు సుడులు తిరుగుతాయి. అమ్మకోసం... ప్రేమతో అమ్మ ఇచ్చే చిరుముద్దు కోసం... వెక్కివెక్కి ఏడుస్తూ ఎదురుతెన్నులు చూస్తారు. ఈలోగా నాన్నో...నానమ్మో ఎత్తుకొని లాలిస్తే...చల్లబడతారు. కానీ కనుచూపుమేరలో వాళ్లెవరూ లేకపోతే...రారని తెలిస్తే...ఆ చిన్ని హృదయాలు ఎన్ని ముక్కలవుతాయో కదా. సరిగ్గా పాకిస్తాన్ సరిహద్దుల్లోని స్వాత్ చిన్నారుల ఆత్మఘోష అలాంటిదే. పాక్ సైన్యానికి, తాలిబన్లకు మధ్య జరుగుతున్న ఘర్షణల పుణ్యమా అని రెండు మిలియన్ల మంది నిర్వాసితులైతే వారిలో మూడింట రెండు వంతుల మంది పిల్లలే. ఆ అల్లర్లు, ఘర్షణలు, కాల్పులు, పేలుళ్లు, రక్తపాతాలు, మృతదేహాలు చూసీ చూసీ... రాత్రుళ్లు నిద్ర పట్టని పసివాళ్లు ఎందరో. అమ్మ లాలింపుకు, నాన్న బుజ్జగింపుకు, బడికి, బాల్యానికి దూరమై... శూన్యంలోకి చూస్తూ... ప్రభుత్వం ఏర్పాటుచేసిన సహాయ శిబిరాల్లో... రోజులు నెట్టుకొస్తున్నారిలా...

బాల్యానికి బహుదూరంగా...

కలం స్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీకూ్కడా వీళ్లలాగా కలంస్నేహం చెయ్యాలని ఉందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకొని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్‌ఫోటోను అతికించి పోస్ట్ చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలు చెప్పండి. వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్ కలంస్నేహం, ప్రజాశక్తి, మోటూరు హనుమంతరావు భవన్, 21/1, అజమాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్.

పేరు: దేవీప్రియ
చదువు: 7వ తరగతి
వయస్సు: 13 సం॥
స్కూలు: సెయింట్ ఆన్స్ హై స్కూల్
లక్ష్యం: డాక్టర్ కావడం
హాబీలు: పుస్తకాలు చదవడం, షటిల్ ఆడడం
చిరునామా: దేవీప్రియ
డాటరాఫ్ యన్. రామ్మోహన్
రావుహుడా కాలనీ, చందానగర్, హైదరాబాద్.

పేరు: జి. అచ్యుత్ కుమార్
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూల్ : జడ్.పి.హెచ్ స్కూల్
లక్ష్యం:ఇంజనీర్ కావడం
హాబీలు: డ్రాయింగ్ వేయడం
చిరునామా: జి. అచ్యుత్ కుమార్
సన్నాఫ్ సత్యనారాయణ, ఎల్ఐసి బిల్డింగ్,
వల్లూరు రోడ్, ఉయ్యూరు, కృష్ణా జిల్లా.

పేరు: ఎస్. సునీల్
చదువు: 8వ తరగతి
వయస్సు: 13 సం॥
స్కూల్: లిటిల్ ఫ్లవర్ స్కూల్
లక్ష్యం : లాయర్ కావడం
హాబీలు: చిత్రలేఖనం
చిరునామా: ఎస్. సునీల్
వీణవంక(గ్రా), వీణవంక(మం), కరీంనగర్.

పేరు: జి. వినీత్
చదువు: 7వ తరగతి
వయస్సు: 12 సం॥
స్కూలు: హార్వస్ట్ పబ్లిక్ స్కూల్
లక్ష్యం: ఇంజనీర్ కావడం
హాబీలు: ఆటలాడడం
చిరునామా: జి. వినీత్
సన్నాఫ్ హరినాథ్ బాబు, ఖమ్మం.

పేరు: జె.పృథ్వి శ్రీ చక్రా
చదువు: 8వ తరగతి
వయస్సు : 14 సం॥
స్కూల్: మాస్టర్ మైండ్ హైస్కూల్
లక్ష్యం : సైంటిస్ట్ కావడం
హాబీలు: స్టాంపులు సేకరించడం, క్రికెట్ ఆడడం.
చిరునామా: జె.పృథ్వి శ్రీ చక్రా
కేరాఫ్ పి. ఆంజనేయులు, ఇం.నెం.4-9-23,
రాంనగర్ వీధి, మహబూబ్ నగర్.

పేరు: జూలూరి పోతులూరాచారి
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
లక్ష్యం : ఇంజనీర్ కావడం
హాబీలు:పాటలు పాడడం, ఆటలు ఆడడం
చిరునామా: జూలూరి పోతులూరాచారి
సన్నాఫ్ సత్యనారాయణాచారి, నూతనకల్(గ్రా),
నూతనకల్ (మం), నల్లగొండ.

పేరు: జి.సాయి ప్రకాష్ యాదవ్
చదువు: 9వ తరగతి
వయస్సు: 15 సం॥
సూ ్లు : వశిష్ట హై స్కూల్
[illegible]: ఇంజనీర్ కావడం
హాబీలు: టీవీ చూడడం, డాన్స్ చేయడం
చిరునామా: జి.సాయి ప్రకాష్ యాదవ్
సన్నాఫ్ జి. ఈదన్న యాదవ్, పెంటవెల్లి
(కొల్లాపూర్), మహబూబ్‌నగర్.

పేరు: బి. జగన్ మోహన్
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు : రిక్కబజార్ హైస్కూల్
లక్ష్యం: పోలీస్ ఆఫీసర్ కావడం
హాబీలు: పుస్తకాలు చదవటం
చిరునామా: బి. జగన్ మోహన్
సన్నాఫ్ రామచంద్ర, బిసరాజుపల్లి తండా,
వెదుళ్లచెర్వు (గ్రా), ఖమ్మం.